AL - HILAL

నెలవంక

Vol 7, Issue: 56 June - 2011 مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية



అమ్మ పాలు అమృతం



నా అన్వేషణ



పూ పరిమళం

ఉచితం



“మేము రేయింబవళ్ళను మా (శక్తి) సూచనలుగా చేశాము. రాత్రి సూచనను మేము కాంతి హీనంగానూ, పగటి సూచనను కాంతిమంతంగానూ చేశాము. మీరు మీ ప్రభువు అనుగ్రాహాన్ని అన్వేషించగలగటానికి! సంవత్సరాల సంఖ్యను, లెక్కను తెలుసుకోగలగటానికి!! మేము ప్రతి విషయాన్ని బాగా విడమరచి చెప్పాము”. (బనీ ఇస్రాయీల్: 12)

సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 56
June 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY

IPC

Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency

www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....



నవ యుగ నిర్మాత ఇస్లాం 3



4 విజ్ఞాన శాస్త్రంలో అద్భుతాలు చేసిన ముస్లింలు



విజ్ఞాన భాండాగారం ఖుర్‌ఆన్ 8

ఆదరంగా, సాహసంగా, సత్యంగా, క్షణక్షణం సుదీర్ఘ దినాంత వేళదాకా పని చేసిన వారి హస్తాలు సుందరాలు. కనుకనే నేడు సయితం వారు కొనియాడ బడుతున్నారు.





అజ్ఞానం – విజ్ఞానం 2
నవ యుగ నిర్మాత ఇస్లాం 3
విజ్ఞాన రంగంలో ముస్లింలు..... 4
నా సత్యాన్వేషణ 6
విజ్ఞాన భాండాగారం ఖుర్‌ఆన్..... 8
సైగలతో సత్యోపదేశం 10
అమ్మ పాలు అమృతం 12
పూ పరిమళం 14
జ్ఞానామృతం 15
ఐపిసి వార్తలు 16
కవితా కుసుమాలు 18
నేటి బాలలే రేపటి పౌరులు 19
నెలవంక ఉత్తరాలు 20

الإسلام والجاهلية - الإسلام خالق العصر الحديث - خدمات المسلمين في العلم الحديث - قصة المهتدي - الإعجاز العلمي في القرآن - تعليم الرسول صلي الله عليه و سلم بالإشارات - حليب الأم نعمة الله الغالية - اختبر معلوماتك - أخبار اللجنة - نشيد (ومثلك لم تلد النساء - ولدت مبرأ من كل عيب) - روضة الأطفال - رسائل الهلال

దృక్పథం

అజ్ఞానం - విజ్ఞానం

ఒక విషయం గురించి ఏమీ తెలియనప్పుడు అజ్ఞానం ఉందంటాం. ఆ అజ్ఞానం ఏదో ఒక నమ్మకానికి దారి తీస్తుంది. ఆయా విషయాల గురించి నిజాలు తెలిసిన తర్వాత అజ్ఞానం తొలగి విజ్ఞానం చోటు చేసుకుంటుంది. అయితే నిజం వెలుగు చూసిన తర్వాత కూడా పూర్వ నమ్మకాన్నే పట్టుకు వ్రేలాడితే దాన్ని మూడ నమ్మకం, అంధ విశ్వాసం అంటాము. అలా మూఢ నమ్మకాలకు కొమ్ము కాసేవారు పవిత్రం కాని దానికి పవిత్రతను అంటగటతారు. దైవం కాలేని వాటిని దైవంగా ప్రతిష్టింపజేస్తారు. నిజ ప్రభువు అయిన అల్లాహ్‌కు ఇవ్వాల్సిన స్థానాన్ని, ఘనతాగౌరవాలను ప్రవక్తలకు, పుణ్య పురుషులకు ఆపాదిస్తారు. పర్యవసానం అంధ విశ్వాసం పరవళ్ళు తొక్కుతుంది. ఇటు వంటి అజ్ఞానాంధకారాల్లో కొట్టుమిట్టాడే వ్యక్తి ఆకాశంలో మెరుపు తీగ కనిపిస్తే దాన్ని ఏదోక దేవత ఝుళిపించిన కొరడాగా భావిస్తాడు. సూర్యచంద్ర గ్రహణాలను చూసి దేవతలకేదో విపత్కర పరిస్థితి ఏర్పడిందని తలపోస్తాడు. 'మశూచి రోగాన్ని' పోలేరమ్మగా, చికెన్ ఫోక్స్‌ను 'అమ్మోరుగా భావించి అలౌకికానందంతో హారతు పడతాడు. వర్షాలు పడటానికి జల యజ్ఞం అంటూ వందల కొలది నెయ్యి డబ్బాలు నిప్పుల్లో ధారబోస్తాడు. జబ్బులు తగ్గడానికి వాతలు పెడతాడు. క్షుద్ర పూజలంటూ పసికందుల్ని బలిగొంటాడు. ద్రాక్ష రసాన్ని ఏసు రక్తంగా, జొన్న రొట్టెను ఆయన మాంసంగా అభివర్ణించుకొని నర మాంస భక్షకుడిగా మారతాడు.

'పవిత్రత' పేరుతో మొదలయిన ఈ బహుదైవారాధనా భావం స్వార్థపరులైన మత నాయకులకు, పీఠాధిపతులకు, పోపులు, బిషప్పులకు, పీష్వాలకు, పీర్లు, ముర్షిద్‌లకు - ముఖ్యంగా రాజులకు సువర్ణావకాశంగా పరిణమించింది. ప్రజల బలహీనతను పసిగట్టిన అవకాశవాదులు ఇటువంటి మూఢ నమ్మకాలను మరింత వ్యవస్థీకృతం చేశారు. 'గాడ్ కింగ్' అన్న సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టారు. ప్రజలకు - ప్రభువుకు మధ్య తాను వారధి లాంటి వాడనని ఒకడంటే, తన ప్రసన్నతలోనే దైవ ప్రసన్నత ఇమిడి ఉందని ఇంకొకడన్నాడు. వేరొకడు మరింత ముందుకెళ్ళి తానే భగవత్ స్వరూపూణ్ణని, అవతార పురుషుణ్ణని ప్రకటించుకున్నాడు. ఈ 'గాడ్ కింగ్' అనే సిద్ధాంతం మూలంగా అధికార, రాజకీయ వ్యవస్థలో చెడు తారా స్థాయికి చేరుకుంది.

విజ్ఞానం వికసించాలన్నా, సైన్స్ భావాలు పరిఢవిల్లాలన్నా, సాంకేతిక పరమైన ఆలోచనలు మొగ్గ తొడగాలన్నా -భావ స్వాతంత్ర్యం ఎంతో అవసరం. కానీ ఈ స్వేచ్ఛా వాయువులు అన్నీ దేశాల్లోలాగే అరబ్బులో, భారత దేశంలో, గ్రీకు దేశంలో సయితం అందని ద్రాక్షగానే ఉండేవి. ఏథెన్స్ నగర యువ కుల్లో స్వేచ్ఛా భావాలను పెంచి పోషిస్తున్నాడన్న అభియోగంపై సోక్రటీస్ బలవంతంగా విషం త్రాగాల్సి వచ్చింది. భారత దేశంలో శూద్రులు వేదాలు చదవకూడదు, వినకూడదు అన్న నిషేధాజ్ఞలాగే గ్రీకు దేశంలో సయితం ఇతరత్రా గ్రంథాలు చదవకూడదన్న ఆంక్షలు విధించబడ్డాయి. ఎందరో కళా పిపాసులు, తాత్వికులు దేశ బహిష్కరణ గావించబడ్డారు. కారాగారాల్లో కుక్కివేయబడ్డారు. ఉరికంబాలకు వ్రేలాడదీయబడ్డారు. యూరి ఫాయిడ్స్, సోక్రటీస్, అరిస్టాటిల్, ఫిరియాస్ మొదలగువారు ఈ కోవకు చెందినవారే. ఒక్క మాటలో చెప్పాలంటే ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం ఎక్కడా శాస్త్రీయ విజ్ఞానానికి సంబంధించిన స్వేచ్ఛ ఉన్నట్టు కనబడదు. మరలాంటప్పుడు స్వయంగా అరబ్బుల్లో ఈ ఆలోచన ఎలా పుట్టింది? సాధారణంగా మిగతా ప్రపంచం ఏ వెనుకబాటుతనానికి, స్తబ్ధతకు లోనై ఉండేదో అదే భావ దారిద్ర్యం, దాస్యానికి అరబ్బులు కూడా గురై ఉన్నప్పుడు వారెలా అందరికి మార్గదర్శకం కాగలిగారు?

సమాధానం - తౌహీద్. అదే వారి మనో వికాసానికి, క్రియాత్మక విప్లవానికి హేతువు అయ్యింది. మిగిలిన జాతుల్లో 'షిర్క్' - అజ్ఞానం ఉండగా, అరబ్బుల దగ్గర 'తౌహీద్' - విజ్ఞా నం ఉండేది. ఈ వ్యత్యాసమే చరిత్రలో అసాధారణమైన పరివర్తనకు కారకం అయింది. ఇది ముస్లింలు సాధించిన విజయం కాదు; ఇస్లాం, ఖుర్‌ఆన్ ద్వారా వారికి ప్రాప్తమయిన మహదానుగ్రహం. క్రీస్తు శకం 7వ శతాబ్దిలో ఇస్లాం ద్వారా ఓ గొప్ప విప్లవం వచ్చింది. అది బహుదైవోపాసన, గాడ్ కింగ్ పెత్తనంతో కూడుకున్న వాతావరణాన్ని ప్రక్షాళించి ఏకేశ్వరోపాసనా భావ విప్లవానికి, స్వేచ్ఛకు అగ్ర స్థానాన్ని కేటాయించింది. ఆ విధంగా మానవ చరిత్రలో ప్రకృతికి సంబంధించిన స్వేచ్ఛా పరిశోధనల నూతన యుగం మొదలయింది. ఈ యుగం వెయ్యేళ్ళ నిరంతర సాధనానంతరం - నేటి - ఆధునిక సైన్స్ మరియు సాంకేతిక పరిజ్ఞానం దశకు చేరుకుంది. కాబట్టి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆధునిక సైన్స్, ఇస్లామీయ (తౌహీద్) విప్లవ ప్రభావమే. కాబట్టి -

భావి భాగ్య విధాతల్లారా! అందరూ నడిచిన బాటలో నడవడం తేలిక. అదే దశాబ్దాలుగా మనం చేస్తున్న పని. ఈ రంగంలో మీరు కొత్త అధ్యాయానికి నాంది వాచకంగా నిలవాలి. నూతన బాటలు వేయాలి. అలా చేయడమంటే గొప్ప సాహసం, తెగింపు మీలో ఉండాలి. ముళ్ళు తొక్కాలి, తుప్పల మీదుగా సాగాలి మీరు. ముళ్లు గుచ్చుకుంటాయి, కాళ్ళు గీచుకుపోతాయి. మీరు నడిచే బాట జనానికి ఉపయోగకరం అని తేలేదాకా జనం కూడా ఎద్దేవ చేయవచ్చు. ఒకసారి ఉపయోగం అని తేలాక ఆ బాటను మీ పేరుతోనే శాశ్వతంగా గుర్తుంచుకుంటారు. ఏది ఏమైనా 'అజ్ఞానం - షిర్క్-కుఫ్ర్'కి ఇష్టమున్నా లేకపోయినా 'విజ్ఞానం - తౌహీద్ - ఇస్లాం' ముందు తలవంచి ఓడిపోక తప్పదు. ఈ విషయాన్నే పరమోన్నతుడైన అల్లాహ్ ఇలా తెలియ జేస్తున్నాడు:

"వారు (సత్య విరోధులు) తమ నోళ్ళతో (ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతరత్రా ప్రసార, ప్రచార సాధనాల ద్వారా) అల్లాహ్ జ్యోతిని ఊది ఆర్పివేయజూస్తున్నారు. అల్లాహ్ మాత్రం తన జ్యోతిని పరిపూర్ణం చేసి తీరతాడు - అవిశ్వాసులకు సత్య తిరస్కారులకు అది ఎంత సహించరానిదైనా సరే!". (అస్సఫ్: 8)

వందల, వేల, లక్షల మంది లాగా ఏ గుర్తింపూ లేకుండా - 'జీవించి ఉండగానే అజ్ఞానుల్లా అనామకంగా మరణించినవారి'లా జీవించడమా? 'మరణించిన తర్వాత కూడా విజ్ఞుల్లా జీవించి ఉండే వారి' జాబితాలో చేరడానికి ప్రయత్నించడమా? మనమే తేల్చుకోవాలి మరి!



మౌలానా వహీదుద్దీన్ ఖాన్

నవ యుగ నిర్మాత ఇస్లాం

అది 1965 నాటి సంఘటన –

అప్పుడు నేను లక్నోలో ఉన్నాను. ఉన్నత విద్యావంతుడైన ఒక ముస్లిమేతర సోదరుడు నన్ను కలుసుకోవడం జరిగింది. ఆయనకు మతంపై నమ్మకం లేదు. మత సంబంధిత విషయాలన్నీ నిష్ప్రయోజనం అని ఆయన అభిప్రాయం. మాట మధ్యలో ఆయన ఇలా అన్నాడు:

'చరిత్ర పుటల నుండి ఇస్లాంను తొలగించి వేస్తే చరిత్రలో వచ్చే లోటు ఏమిటంటారు?'

దీన్ని వినగానే నా నోట అప్రయత్నంగా వచ్చిన మాట: **"ఏమిటంటారా? అదే, ఇస్లాంకు పూర్వం ఏ లోటు ఉండేదో అదే లోటు ఉంటుంది".** నా సమాధానం వినగానే ఆయన మౌనంగా ఉండిపోయాడు. నమ్మదగ్గ చరిత్ర ప్రకారం ఏ విషయాలనైతే ప్రగతి, అభ్యుదయం అని పిలవడం జరిగిందో అవన్నీ ఇస్లాంకు పూర్వం ప్రపంచంలో లేవు. ఇస్లాం ఆవిర్భావం తర్వాతనే అవిన్నీ వెలుగు చూశాయి. ఈ యదార్థం ఆయనకు తెలియంది కాదు. అయితే ఈ ప్రగతీ వికాసాలు ఇస్లాంతో ముడిపడి ఉన్నాయనే విషయంపైనే ఆయనకు సందేహం.

వాస్తవంగా ఇస్లాం దేవుని మార్గదర్శకత్వ దిక్సూచి. అది మనిషికి పరలోకపు మోక్షం, సాఫల్య మార్గం చూపుతుంది. సైన్సు వికాసానికి, పారిశ్రామిక ప్రగతిని ప్రత్యక్షంగా సాధించి చూపటం ఇస్లాం ప్రధాన ఉద్దేశ్యం కాదు. కానీ, ఇస్లామీయ విప్లవం సైన్సు, పారిశ్రామిక రంగాలలో జరిగిన ప్రగతికి, అభివృద్ధికి సోపానం అయిందనేది మాత్రం నిర్వివాదాంశం. ఒకవేళ ఇస్లామీయ విప్లవమే గనక రాకుండా ఉండి ఉంటే వైజ్ఞానికి, పారిశ్రామిక ప్రగతులు కుడా వెలుగులోకి రాకుండా ఉండేవి.

ఫలాన్ని అందజేయడమే వృక్షం యొక్క లక్ష్యం. కాని ఆ వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించినప్పుడు అది ఫలాన్ని మాత్రమే కాక నీడను సయితం ఇస్తుంది. ఇస్లాం కూడా అంతే. దైవ మార్గదర్శకత్వపు ద్వారాన్ని ప్రజల కోసం తెరవటమే ఇస్లాం ప్రధాన ఉద్దేశ్యం. ఆ విధంగా ప్రజలు దేవుని శాశ్వత సామీప్యం పొందాలని ఆది కోరుతుంది. ఇస్లాం ఆపాదమస్తకం శాంతీ శ్రేయాల ధర్మం. అందులో సత్యం, స్వేచ్ఛ, ప్రగతి మూర్తీభవించి ఉన్నాయి. అది ఒక్కసారి స్థాపించబడితే చాలు, సర్వ మానవాళి కోసం అది శ్రేయోదాయకం, శుభప్రదం అయిపోతుంది. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ.

అంధకారం నుండి వెలుగు వరకు

దేవుడు ఒక సంపూర్ణమైన ప్రపంచాన్ని నిర్మించాడు. ఇంకా ఆయన మనిషిని పరిపూర్ణ రూపంలో పుట్టించాడు. నువ్వీ ప్రపంచంలో ఉండు. దీన్నుండి లాభం పొందు అని ఆదేశించాడు. నీ సృష్టికర్త, నీ పూజ్యనీయుడు ఒక్కడే. ఆ ఒక్క దైవాన్నే ఆరాధించు, ఆయన్ను తప్ప మరొకరిని దైవంగా చేసుకోకు అని కుడా ఆయన మనిషికి ఎరుక పర్చాడు. కాని మనిషి భావ దాస్యంలో పడిపోయాడు. అతను అగోచర దేవునిపై తన ధ్యాసను నిలుపలేక పొయాడు. క్రమంగా అతను గోచర సృష్టితాల వైపు మొగ్గసాగాడు. తనకు పెద్దదిగా, అందంగా కనిపించిన ప్రతి దాన్ని దైవమనుకుని లేదా దైవాంశ సంభూతం అనుకుని ఆరాధించసాగాడు. ఆ విధంగా ఒకవైపు మహాత్ములైన మనుషులకు ఒక రకమైనటువంటి పవిత్రతను ఆపాదించటం జరిగితే, మరో వైపు ప్రకృతి పూజా పరంపర ప్రారంభమయింది. దాన్నే గోచరాల పూజ (Phenienal Worship) లేదా ప్రకృతి పూజా (Nature Worship) అని అంటారు.

ఈ దైవేతర శక్తుల దాస్యానికి మరో పేరే **'షిర్క్'**. ఈ షిర్క్ అనే కర్రి మబ్బు క్రమ క్రమంగా విశ్వాసం మరియు ఆచరల కోణాలన్నింటిపై దట్టంగా అలుముకు పోయింది. శుభం–అశుభం శకునం–దుశ్శకునం వంటి కాల్పనిక ఆచారాల మాధ్యమంతో అది కుటుంబ ఆచారాలలో అంతర్లీనమైపోయింది. దైవ సంబంధిత రాజు (Divin King) అను సిద్ధాంతం రూపంలో అది రాజకీయ వ్యవస్థ లో అనివార్య అంశంగా మారింది.

ఇది ప్రాచీన కాలపు మతం. ప్రాచీన ప్రపంచం పూర్తిగా కాల్పనిక విశ్వాసాలపై నెలకొని ఉంది. దాన్నే మతం పరిభాషలో షిర్క్ అనీ, సాహిత్య భాషలో మూఢ నమ్మకాల దాస్యం (Suprestition) అని అనడం జరుగుతుంది.

పూర్వం ఏ ప్రవక్త వచ్చినా ఈ దోషాలను సరిదిద్దడానికే వచ్చారు. వారు అన్నీ కాలాల్లోనూ, అన్నీ జాతుల్లో ప్రభవించి; షిర్క్ (బహు దైవారాధన)ను విడనాడండి, ఒకే దేవుణ్ణి ఆరాధించండి అనే సందేశం ఇచ్చారు. అలా వచ్చిన వారి సంఖ్య ఆది మానవుడు ఆదం మొదలు ప్రవక్త ఈసా (అ) వరకు ఒక లక్షా ఇరవై నాలుగు వేల మంది అని ప్రవక్త స) వారి ఓ ఉల్లేఖనం ద్వారా తెలుస్తుంది. కాని మనిషి వాళ్ళ మాటకు శిరసా వహించేందుకు సుముఖత చూపకపోగా వారిని నానా యాతనలకు గురి చేశాడు. ఫలితంగా ప్రవక్తల సందేశం సత్యధర్మ ప్రకటన వరకే పరిమితమైంది. అది విప్లవ స్థాయికి చేరుకోలేక పోయింది.

షిర్క్– బహుదైవోపాసన ప్రగతి బాటలో అడ్డుగోడగా తయారయింది. దీన్ని ఎదుర్కోవడం ఎలా అన్నది ప్రశ్నగా మిగిలింది. అటు వంటి క్లిష్టతర ఘడియల్లో – క్రీస్తు శకం 6వ శతాబ్దిలో – అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) గారి ప్రభవనం జరిగింది. దేవుడు తన ప్రత్యేక నిర్ణయానుసారం అయన్ను సందేశ ప్రదాతగానే కాకుండా దుష్ట శిక్షణ కోసం సైనిక చర్య (Military Operation) గైకొనే వానిగా కూడా నియమించాడు. ఆ నిమిత్తమే అంతిమ దైవ గ్రంథం ఖుర్ఆన్ అవతరణ జరిగింది.

"(ఓ ముహమ్మద్!) నీవు ప్రజలను చీకట్ల నుండి వెలికి తీసి వెలుగులోకి తీసుకురావటానికి మేము మహోన్నతమైన ఈ గ్రంథాన్ని నీపై అవతరింప జేశాము". (ఇబ్రాహీమ్: 1)

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"అల్లాహ్ ఎవరి మాధ్యమంతోనైతే మిథ్యావాదాన్ని నిర్మూలించగోరాడో ఆ నిర్మూలకుణ్ణి నేనే.**

దీన్ని బట్టి విదితమయ్యేది ఏమిటంటే – మహా ప్రవక్త ముహమ్మద్ (స) కేవలం సందేశహరులు మాత్రమే కాదు; దుష్ట శక్తుల భరతం పట్టడానికి ఏతెంచిన సత్య ధర్మ ధ్వజ వాహకులు కూడాను. ఆయన ఏక కాలంలో సందేశ ప్రదాత అవడంతోపాటు ప్రజలు సహజమైన రీతిలో స్పందించేలా చేసేవారు కూడా. అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారి ఈ ఉద్యమం పరిపూర్ణమవడానికి సద్వర్తనులైన మానవులతోపాటు దైవ దూతలు కూడా తోడ్పడ్డారని దివ్య ఖుర్ఆన్ ద్వారా ద్యోతకమవుతున్నది.

అవును; దేవుడు ఒక నవయుగానికి నాంది పలకటానికి, శుభప్రదమైన వ్యవస్థను ఉనికిలోకి తీసుకు రావడానికే ఇదంతా చేయవలసి వచ్చింది.



విజ్ఞాన రంగంలో అద్భుతాలు చేసిన ముస్లింలు

(ఈనాటి ముస్లింలను చూసి వీరి పూర్వీకులు ఒకప్పుడు 'సైన్స్'లో మహా గొప్పగా రాణించారని చెప్పడం కష్టమే. కానీ గత చరిత్రను సునిశితంగా పరిశీలించినట్లయితే – పూర్వం ముస్లింలు అభ్యసించని విద్య అంటూ ఏదీ లేదు అని చెప్పక తప్పదు. వారు చేపట్టిన ప్రతి పనినీ సంపూర్ణం చేసి మరీ వెళ్ళారు. ఇది ఎలా సాధ్యమైంది అటే దానికి కారణాలు ఎన్నో! మౌలికంగా వారికి ఇస్లాం ధర్మం పట్ల, అంతిమ దైవ గ్రంథం పవిత్ర ఖుర్‌ఆన్ పట్ల, మహా ప్రవక్త ముహమ్మద్ (స) వారి ప్రతి ప్రవచనం పట్ల అమిత శ్రద్ధా భక్తులుండేవని ఓ మేధావి చెప్పిన మాట విస్మరించరానిది. మచ్చుకు కొందరి సేవల్ని ఇక్కడ పేర్కొంటున్నాము. – ఎడిటర్)

"వాస్తవం ఏమిటంటే – 'ఫిజిక్స్' సంస్థాపకులు అరబ్బులు".
(Hum Bolodt)



"మధ్య యుగాల్లో ప్రపంచ ప్రగతిలో, జ్ఞానాభివృద్ధిలో ముస్లింలు పాల్గొన్నట్లు ఏ ఇతర సముదాయాలు పాల్గొనలేదు"
(Hitti - A Histry of Arabs Henry Pirmne)



ఉన్దులుస్ (Spain)కి చెందిన మేధావి 'అబుల్ ఖాసిమ్ అల్ జహ్రావీ' (Albucasis: 936 –1013). పూర్తి ప్రపంచంలోనే 'Surgery' ప్రక్రియకు పితామహుడు, తొలి సర్జనిస్ట్. ఆయన రెండు వందలకు పైగా సర్జరీ పరికరాలను ప్రవేశ పెట్టాడు. ఈ నాటికీ అవి ప్రాచుర్యంలో ఉన్నాయి.

ఒకప్పుడు అరబీ నేర్చుకొనని వారికి సైన్స్ గురించి తెలుసుకోవడం కుదరదనే వారు. క్రీ.శ 832లో బాగ్దాద్‌లో 'బైతుల్ హిక్మహ్' (Scince Acodemy)పేరున అప్పటి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓ సమావేశం ఏర్పాటు చేయబడింది. అబూ జాఫర్ తన పుస్తకంలో ఎన్నో చిత్రవిచిత్ర విషయాలను చర్చించాడు. నేటికీ ఆయన పుస్తకం ద్వారా ఎందరో లబ్ధి పొందుతున్నారు.




'Geography'లో 'Glob'కి ఉన్న ప్రాధాన్యత ఏపాటిదో తెలిసిందే. 'అల్లామా ఇద్రీస్' (dreses –1099 – 1166) దీన్ని కనిపెట్టిన మొట్టమొదటి వ్యక్తి. ఆయన 45 కేజీల గుండ్రమైన వెండి ఫలకపై ప్రపంచ పటాన్ని అరబీ భాషలో చెక్కించారు. 350 సంవత్సరాల వరకు యూరప్‌లో 'జియోగ్రాఫీ ఆఫ్ ఇద్రీసి'నే చదివించారు.



విరిగిన ఎముకల్ని జోడించే విధానాన్ని ప్రవేశ పెట్టిన తొలి వ్యక్తి **'అబ్దుల్ మలిక్ ఉస్దులుసీ'.**






గడియారం లేకుండా ఈ రోజు జీవితమే దుర్లభంగా తోస్తోంది. సమయ విలువను ఎరుపర్చే ఈ గడియారాన్ని తయారు చేసిన వ్యక్తి **'అల్లామా ఇబ్ను యూసుఫ్.**



Mathematics – ఇది ముస్లింల అత్యంత విలువైన పరిశోధనా ఫలితం. ఆల్ జీబ్రా లెక్కల విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి **'ముహమ్మద్ బిన్ మూసా అల్ ఖవార్జమీ'.**(Algorizm – 8 సెంచురీ) అలాగే 'Zeero' సిద్ధాంతాన్నిప్రవేశపెట్టింది కూడా ఆయనే. 'నెగెటివ్ థింకింగ్' (నకారాత్మక ఆలోచనలు)ని పరిచయం చేసింది కూడా ఆయనే.

మీరు 'ఉమర్ ఖియామ్' గురించి వినే ఉంటారు. ఈయన ఓ మంచి కవిగా పేరు పొందారు. అదే విధంగా 'Equrion' గురించి ఎన్నో గొప్ప చూచనలు ఇచ్చారు.





'Physics' సంస్థాపకులు ముస్లింలని ఇంతకు ముందే తెలుసుకున్నాము. ఫిజిక్స్ ప్రపంచంలో 'అబూ అలీ హసన్ ఇబ్ను హైసమ్' (Alhezen; 965 - 1040) పేరు చిర పరిచితమైనది. ఆయన విరచితమై 'అల్ మనాజిర్' పుస్తకం – కాంతిని దృష్టిలో పెట్టుకుని వ్రాసినదే. కాంతి ఏ వస్తువుపై పడుతుందో దాన్ని మూడు విధాలుగా విభజించారాయన. 1) Trans Parent (స్పష్టమైనది). 2) Trans Lusent (సగం స్పష్టమైనది). 3) Trans Opaque (అస్పష్టమైనది). అలాగే 'Pin - Hole Comera' ఆయన కనుగొన్నదే. కాంతి కిరణాలపై 'Law of Refllection of Ligth' ఆయన తెలియపరచినదే.'Refrection of light' గురించి వివరించిందీ ఆయనే. అలాగే 'ఇబ్ను సుక్వై' ఫిజికల్ ప్రోపెరిటిక్స్ గురించి ఎన్నో విలువైన సూచనలు ఇచ్చాడు.

'micro scope'ను కనిపెట్టింది 'గెలీలియో' అని మనం చదివే ఉంటాము. కాని చరిత్ర ప్రకారం 'అబూ ఇస్హాఖ్ ఇబ్రాహీమ్' మొట్టమొదటి సారి 'మైక్రోస్కోప్'ను కనుగొన్నాడు.



ప్రపంచంలో తొలి మెకానికల్ ఇంజనీర్ 'అహ్మద్ బిన్ షాకిర్'. అయన ఓ అద్భుతమైన గడియారం తయారు చేశారు. 'అబూ అబ్బాస్ అహ్మద్ బిన్ ముహమ్మద్' సన్ డైల్ గడియారాన్ని తయారు చేశాడు.



అలీ బిన్ ఈసా (Jesu Hali) Vernier Scalex ని ప్రవేశ పెట్టాడు. 'Physical Balance'ని కనుగొన్న వ్యక్తి ముహమ్మద్ జకరియా రాజీ (Rhazes: 865 – 925)).



Chemistry యుగాన్ని ముస్లింల యుగంగా అభివర్ణిస్తారు. ఈ రంగంలో మకుటం లేని మారాజు 'జాబిర్ ఇబ్నుల్ హయ్యాన్' (Geber: 722–815). యూరప్ దేశస్థులు ఈయన్ను 'కైమిస్ట్రీ'కి పితామహునిగా పేర్కొంటారు. ఆయన 'అక్వా రేజియా'ని తయారు చేశారు. ఈ విషయంలో 'ఇబ్ను సీనా' సేవ సైతం గుర్తించదగినది. ఆయన ఈ పనిలో ఉపయోగపడే ఎన్నో రాళ్ళ గురించి తెలియపరిచాడు.




శరీర ధర్మ శాస్త్రంలో 'రక్త ప్రసరణ' గురించి మొదటి సారి వర్ణించిన శాస్త్రవేత్త ఇబ్ను నఫీస్.



విజ్ఞాన రంగంలో మహోద్భుత సేవల్ని అందించిన నోబెల్ బహుమతి పొందిన శాస్త్రవేత్త ప్రోఫెసర్ అబ్దుస్సలాం.



మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలామ్ భారత అణు రంగంలో అందించిన సేవల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యావత్తు ప్రపంచంలో డాక్టర్ అబ్దుల్ కలామ్ మరియు భారత దేశం చర్చనీయాంశం అయ్యారు. మిసయిల్స్ తయారు చేయడంలో భారత దేశం విజయం సాధించిందా? అని పాశ్చాత్య ప్రపంచం ముక్కున వేలేసుకుంది.



ఎందరో మహానుభావ్యులు! అందరికి సలాములు!!

ఆదరంగా, సాహసంగా, సత్యంగా, క్షణక్షణం సుదీర్ఘ దినాంత వేళదాకా పని చేసిన వారి హస్తాలు సుందరాలు. కనుకనే నేడు సయితం వారు కొనియాడ బడుతున్నారు.

ఈ రంగం శ్రమతో కూడినదే. దిగులు పడకండి. చిర్రుబుర్రులాడకండి. నిరాశ చెందకండి. మన అవకాశాలిప్పుడే మొదలయ్యాయి. గుర్తుంచుకోండి! గొప్ప పని లింకా మొదలవ్వలేదు. గొప్ప ఉద్యమం ఇంకా పూర్తవ లేదు.

'నైపుణ్యం, ఆశయం, స్ఫూర్తి, ఆలోచనా ధారన తడిసి ఆరనివ్వండి. దౌర్బల్యం బలంగా మారేదాకా, చీకటి వెలుతురయ్యే దాకా, అపసవ్యం సవ్యమయ్యే దాకా' అన్న లూయాన్ కోరోల్ ప్రోత్సాహం మనకు బాగా పని కొస్తుంది. ఈ లక్ష్యాన్ని కృషి అనే ఆయుధంతో ఛేదించ వచ్చు. ప్రపంచంలో నలు వైపులా ముళ్ళే కానవస్తా యన్నది నిజమే. కాని మనం ఆ ముళ్ళ మధ్య గులాబీ పువ్వులా నవ్వుతూ....సుగంధ పరిమళాలను వెదజల్లుతూ .....విజయం వైపు పయనించవచ్చు.



నా సత్యాన్వేషణ

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, అనంత శక్తిమంతుడు సకల లోకాలకు ప్రభువు అయిన అల్లాహ్ పేరుతో మొదలు పెడుతున్నాను.

నా పేరు నేరెళ్ళ రాజశేఖర్, తండ్రి పేరు నాగేశ్వర రావు. తల్లి పేరు శశికళ డేవిడ్. మాది సనాతన క్రిష్టియన్ సంప్రదాయ కుటుంబం. మా సొంత ఊరు కర్నూలు జిల్లా చాగల మర్రి మండలం, చింతలచెరువు గ్రామం. కోలుముల పేటకు ఆనుకొని ఉన్న క్రిష్టియన్ కాలనీలో బ్రిటిష్ వారు కట్టించిన చర్చి ఉన్నది. అక్కడ ఉన్న వారందరినీ సంఘంగా చేశారు. ఆ సంఘంలో పేరున్న కుటుంబం మాది. ఎందుకంటే మా నాన్నగారు ఆర్మీలో రిటైర్డ్ అయిన తరువాత లోకల్ కరెంట్ ఆఫీస్ లో లైన్‌మెన్‌గా పని చేశారు. అందువలన మా అబ్బగారిని సంఘమయ్యగా ఎన్నుకొన్నారు ఊరి ప్రజలు. మేము చర్చిలో ప్రార్థన చేయించడమే కాక చావులకు, పెళ్ళిళ్ళకు ఇంటింటికీ వెళ్ళి ప్రార్థనలు చేయించేవాళ్ళం. నా చిన్నప్పుడు మా నానమ్మ చర్చిలో పాస్టర్‌గా పని చేశారు. నేను నానమ్మతో పాటు చర్చికి వెళ్ళి ప్రార్థనలు చేస్తుండే వాణ్ణి. నాకు ఊహ తెలిసిన తరువాత మా అబ్బ, నానమ్మ పాస్టర్ గా గతించారు. పెద్దయ్యాక మా అన్నకు, నాకు ఈ సంఘపు బాధ్యతలు అప్పగించ బడినాయి. నేను బాప్తిస్మా మరియు నిర్ధారణ తీసుకున్నాను. ఇది తీసుకోవడానికి కొన్ని షరతులు ఉన్నాయి. యెహోవా (అల్లాహ్) మెచ్చే ప్రవక్త కు ఇచ్చినటువంటి 10 ఆజ్ఞలతో పాటు మరి కొన్ని ప్రార్థనలు వచ్చి ఉండాలి. ఆ ఆజ్ఞలతో మొట్టమొదటిది **"నీ దేవుడైన యెహోవాను నేనే, నేను తప్ప నీకు వేరొక దేవుడు ఉండకూడదు. పైన ఆకాశమందే గానీ, క్రింద భూమియందే గానీ, భూమి క్రింద నీళ్ళయందే గానీ ఏ విగ్రహము అయిననూ గానీ నీవు చేసుకొనకూడదు. వాటిని పూజించకూడదు. వాటికి సాగిలపడ కూడదు"** అన్నది. ఈ ఆజ్ఞయే నాలో ఆలోచనను రేకెత్తించింది. నా మతం సరియైనదే అని నమ్మకం ఉన్నా ఏదో వెలితి నన్ను వేరే మతాలలోనికి తొంగి చూసేలా చేసింది. అందులో నన్ను ఇస్లాం ఆకర్షించింది.

ధర్మభ్రష్టుణ్ణి అవుతున్నానేమో అని ఒకవైపు, నిజమార్గమేమిటో తెలుసుకోవాలన్న తపన మరో వైపు ఎటూ తేల్చుకోలేక పోయేవాణ్ణి. అయినా ఇస్లాం వైపునే నా చూపు మాటి మాటికీ పోయేది. ఎందుకు ఇలా జరుగుతున్నది అని తరచి చూస్తే నా జీవితంలోని సంఘటనలు, నా పరిసరాలు, స్నేహితులూ అన్నింటినీ మించి అల్లాహ్ కరుణా కటాక్షాలు నామీద ప్రభావం చూపి ఉండవచ్చు. అందులో కొన్ని అనుభవాలు మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

మొట్టమొదటిది: నా తల్లిగారు నర్స్. ఉద్యోగం రీత్యా మేము చాలా ఊర్లు మార వలసి వచ్చేది. కడప జిల్లా సుండుపల్లెలో ఉండగా నేను చాలా చిన్నవాణ్ణి. ఒక సారి మా అమ్మ గారు అర్జెంట్ డ్యూటీ మీద వెళుతూ మా పొరుగున ఉండే అజీజ్ ఖాన్ గారి భార్యకు నన్నప్పగించి వెళ్ళారు. ఆమెకు కూడా నా వయసు కుమార్తె ఉంది. నేను ఆకలితో ఏడ్చే సరికి తన బిడ్డకు పట్టవలసిన పాలను నాకు త్రాపినది ఆ మహాతల్లి. నాకు ఊహ తెలిసిన తరువాత నా తల్లిదండ్రుల ద్వారా ఈ విషయం తెలుసుకున్నాను. ఆమె త్యాగబుద్ధితో నాకు పాలు త్రాపించినందులన ఆ తల్లి వారసత్వం గా నాలో ఇస్లాం ప్రవేశించినదో లేక ఒక ముస్లిం మహిళ నాకు పాలు త్రాపినది అన్న కారణంగానో తెలియదు గానీ ముస్లిమ్స్ అంటే నాకు చాలా అభిమానం ఏర్పడినది.

సుండుపల్లె నుండి ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్ నిమిత్తం అమ్మగారు లక్కిరెడ్డిపల్లెకు మార వలసి వచ్చినది. అక్కడ అబ్బాస్ అలీ ఖాన్, అనే స్నేహితుడు పరిచయమయ్యాడు. ఇతని ద్వారా ఇస్లాం వైపు నా ప్రయాణం మొదలైనది. తరువాత అమ్మకు కడపకు ట్రాన్స్‌ఫర్ అయినది. అక్కడికి పోయిన తరువాత అబ్బాస్ అలీ ఖాన్, తన చిన్నాన్న కుమారుడు నవాజ్ అలీ ఖాన్‌తో పరిచయం చేయించాడు, నవాజ్ స్నేహితులు నా స్నేహితులయ్యారు. అందులో బషీర్ ఖాన్ ఆనే స్నేహితుని ద్వారా నేను ఇస్లాంకు మరింత దగ్గరయ్యాను. నేను బషీర్‌తో ఇస్లాం స్వీకరిస్తానని చెప్పాను. మా ఇంటివారు గొడవ పడతారనే అనుమానంతో బషీర్ ఇప్పుడే వద్దు నీ కాళ్ళ మీద నీవు నిలబడ్డ తరువాత ఇస్లాం స్వీకరిస్తువులే అని నచ్చ జెప్పాడు. బహుశా అప్పుడు ఇస్లాం స్వీకరించి ఉంటే నికలడ ఉండేది కాదేమో! ఎందుకంటే టీనేజీ తొందరపాటు నిర్ణయం మరియు నాకు ఇస్లాం గురించి తెలిసినది చాలా తక్కువ గనక.

తరువాత మేము సొంత ఊరుకు చేరుకున్నాము. అక్కడ చర్చిలో మా కార్యక్రమాలు చేసుకుంటూ ఉండేవారము. కొంతకాలం తర్వాత అన్నగారి లాయర్ ఉద్యోగం రీత్యా మరియు ఆయన చదువు రీత్యా మండల కేంద్రమైన చాగల మర్రికి మేమందరము రావలసి వచ్చినది. అక్కడ మొహిద్దీన్, అబ్దుల్లాహ్, అహ్మద్, యాకూబ్ అనే స్నేహితులు పరిచమయ్యారు. అదే నా జీవితంలో టర్నింగ్ పాయింట్. నవ యువకులలో ఉండే అన్ని లక్షణాలు వీరిలో ఉన్నా నమాజు సమయం కాగానే వీరందరూ మసీదుకు వెళ్ళేవారు. నేను నా కుటుంబ సభ్యులు ఆది వారం చర్చికి వెళ్ళేవారం. ఎప్పుడైనా ఇంట్లో ప్రార్థన చేస్తుండేవారము. కానీ వీరిలా రోజూ 5 పూటల ప్రార్థన నా ఊహకందని విషయం. నాలో అలజడి మొదలయినది. ఎందుకంటే ఎంతో చిలిపిగా, ఉల్లాసంగా, జాలిగా గడిపే సమయంలో అజాన్ వినబడగానే వీరి ప్రవర్తన మారిపోయేది. ఏదో శక్తి వీరిని కమాండ్ చేస్తున్నట్లు నన్ను ఒంటరిగా వదిలేసి మసీదుకు వెళ్ళి పోయేవారు. **"ఇస్లాంలో నమాజుకు ఇంత ప్రాధాన్యత ఉందా? ఏ శక్తి వీరిని ప్రార్థన సమయంలో ప్రాపంచిక విషయాల నుండి ప్రార్థనా మందిరానికి తీసుకొని వెళుతున్నది?"** అన్న చింతన నాలో చిగుళ్ళు పోసుకుంది. వారు నమాజు నుండి రాగానే మళ్ళీ సంతోషంగా కబుర్లలో పడేవారము. వీరు స్టూడెంట్స్ జమాఅత్ సభ్యులు (ఎస్ఐఒ) అయినందు వలన ఇస్లాం గురించి, మరియు జమాఅతే ఇస్లామీ హింద్ ప్రోగ్రామ్స్, తబ్లీగ్ జమాఅత్ ఇజ్తిమాల గురించి కూడా మాట్లాడుకుంటూ వుండేవారు. నేను అవన్నీ వింటూ అర్థం చేసుకోవడానికి ప్రయిత్నించేవాన్ని. ముఖ్యంగా అబ్దుల్లాహ్ మరియు యాకూబ్ చెప్పిన మాటలు నాలో సెన్స్‌ను, కామన్‌సెన్స్‌ను పెంచాయి.



"ఇస్లాంలో నమాజుకు ఇంత ప్రాధాన్యత ఉందా? ఏ శక్తి వీరిని ప్రార్థన సమయంలో ప్రాపంచిక విషయాల నుండి ప్రార్థనా మందిరానికి తీసుకొని వెళుతున్నది?" అన్న చింతన నాలో చిగుళ్ళు పోసుకుంది.

"యేసు దేవుడు కాదు, దైవ కుమారుడూ కాదు. ఆయన దైవ ప్రవక్త మాత్రమే. ఆయన చనిపోలేదు, సజీవంగా పై ఆకాశాలలోకి లేపు కోబడ్డారు. తిరిగి వచ్చి ముహమ్మద్(స) ప్రవక్త వారి సముదాయంలోని ఓ వ్యక్తిగా రాజ్యపాలన చేస్తారు. అప్పుడు అత్యధిక శాతం మంది క్రైస్తవ సోదరులు సత్యం గ్రహించి దైవ ధర్మమైన ఇస్లాం ఛత్రఛాయల్లో వచ్చి చేరతారు" అన్న మాట నాలోని సత్యార్థి మరింత పెంచింది.

బైబిల్‌లో కూడా యేసు "నేను దేవుడని, నన్నే ఆరాధించండి అని ఎక్కడా చెప్పలేదు." ఆయన ప్రతి పనిని సృష్టికర్త నామమునే చేసేవారు. సృష్టికర్తనే ఆరాధించేవారు. పాత నిబంధన చూసినట్టయితే యెహోవా ఇలా సెలవిచ్చెను: **"నీ దైవమైన యెహోవాను నేనే. నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండ కూడదు."**

ఈ ఆజ్ఞ ద్వారా యేసు (ఈసా అలై) దైవ ప్రవక్త మాత్రమే అని, దైవానుగ్రహం వలన ఆయన అద్భుతాలు చూపినంత మాత్రాన ఆయన దైవ కుమారుడు కాజాలడని గ్రహించాను. నా ఇంటిల్లిపాదికీ పదేపదే వివరించినా వారు విశ్వసించలేదు, నా మనసు మాత్రం విశ్వసించింది. నేను మసీదుకు వస్తానని నా స్నేహితులతో చెప్పాను. వారు ఒక ప్రోగ్రాంకు స్నానం చేసి రమ్మని ఆహ్వానిస్తే జీవితంలో మొదటిసారి చాగలమర్రి మసీదులో అల్లాహ్ కృప వలన ప్రవేశించాను. అక్కడ ఇమామ్ మహబూబ్ సాహెబ్ గారి ప్రసంగంతో చాలా ప్రభావితమయ్యాను. తరువాత అప్పుడప్పుడూ జమాఅత్ ప్రోగ్రామ్స్‌కు హాజరవుతుండేవాన్ని. మా ఇల్లు మసీదుకు ఆనుకునే ఉండేది. ప్రతి అజాను పిలుపు నాలో ఏదో అలజడి రేపేది. క్రమంగా సకల లోకాల సృష్టికర్త ఒక్కడే అని సృష్టికర్త నామమునే హృదయంలో ఆరాధించే స్థితికి చేరుకున్నాను. అయితే నా ఆరాధనకు రూపు లేఖలు లేవు. ఇస్లాం స్వీకరించాలంటే కుటుంబ, ఆర్థిక, సామాజికంగా ఇలా ఎన్నో ప్రాబ్లమ్స్ రావచ్చని వెనకంజ వేశాను.

కుటుంబ కలహాలు లేక ఆర్థిక కారణాలు కావచ్చు లేక నా స్నేహితులు బషీర్‌ఖాన్, ననాజ్ ఖాన్, అహ్మద్‌లు కువైట్‌లో ఉన్నందు వలనో నేను కూడా కువైట్‌కు వెళ్ళాలని నాలో కోరిక కలిగింది. అయితే 11 సంవత్సరాలు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. చివరకు అల్లాహ్ కృప వలన నా ప్రయత్నం ఫలించి 5 జూన్ 2008లో కువైట్‌కు చేరుకున్నాను. ఎ.సి పని అయినందువలన బరువుతో బిల్డింగ్‌లు ఎక్కడం దిగడంతో నా కాలు వాపు వచ్చి ఆ పని వదిలేయవలసి వచ్చింది. ఈ మధ్య కాలంలో నా స్నేహితుని ద్వారా గీటురాయి, **నెలవంక**, నేను ఆరాధించే ఇస్లాం పుస్తకాలు నాకు అందినవి. అది చదివి మరింత జ్ఞానం పెరిగినది. ఎ.సి పని వదిలేసిన తరువాత సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగం కొరకు మాలియాలోని వారి ఆఫీసుకు వెళ్ళి మేనేజరు కోసం వెయిట్ చేస్తుండగా నా చూపు (ఐ పి సి) వారి ఉచిత పుస్తకాల స్టాండ్ మీద పడింది. సత్య ప్రియులకు అన్న కరపత్రాన్ని తీసుకున్నాను. అందులో యేసు (అ) గురించి ఉంది. యెహోవా అల్లాహ్ ఒక్కడే అని తెలిసి నా కళ్ళలో ఆనంద భాష్పాలు. నా సంతోషానికి అవధులు లేవు. వెంటనే నా ఇంటికి ఫోన్ చేసి నా సత్యాన్వేషణ ఫలించిందని శుభవార్త తెలిపాను. సెక్యూరిటీ గార్డ్‌గా ఉద్యోగంలో చేరినాను. అల్లాహ్ అని స్మరించడం మొదలు పెట్టాను. నాతోటి ఉద్యోగుల వెంట నమాజు చేస్తుండే వాణ్ణి. అయితే నమాజు ఎలా చేయాలో తెలియక తప్పులు చేస్తుంటే వారు చూసి నీవు చేస్తున్నది తప్పు అంటే ఇన్షాఅల్లాహ్ త్వరలో సరిదిద్దుకుంటానని చెప్పేవాడిని. అప్పుడు నేను చేసుకున్న దుఆ నాకు ఇప్పటికీ గుర్తున్నది – **"ఓ అల్లాహ్! నిన్ను ప్రతిరోజూ సరైన రీతిలో ఆరాధించే భాగ్యాన్ని కలిగించు. అలాంటి వాతావరణం నాకు కల్పించు".**

నెల పూర్తయిందో లేదో అకామా తగిలిస్తామని ఉద్యోగంలో చేర్చుకున్న సెక్యూరిటీ కంపెనీ వారు అకామా ఇవ్వలేము అని మోసం చేశారు. ఇక గత్యంతరం లేని పరిస్థితులలో నాకు డ్రైవింగ్ తెలిసినందు వలన ఇస్మాయిల్ అనే స్నేహితుని ద్వారా సబా అల్ నాసిర్‌లోని ఒక కువైటీ ఇంటి డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరాను. ఈ విధంగా దేవుడు నా మొరను ఆలకిస్తాడన్న విషయం అప్పుడు నాకు తెలియదు. నా సెలవుదినమైన ఒక జుమా రోజు మాలియాకు వెళుతుంటే నా స్నేహితుడు ఫోన్ రిపేర్ చేయించుకుని రమ్మని నాకు ఇచ్చాడు. అది చూపెడితే మాలియాలోని షాప్ వారు చైనా ఫోన్లు ఇక్కడ చెయ్యరు; సూఖ్ పతనియాలో పొమ్మని

నేను నా భార్య ముందు ఎప్పుడూ గొడవ పడే వారం. కానీ ఇప్పుడు మా జీవితంలో ప్రశాంతత, అనురాగం, ప్రేమ, వాత్సల్యం నెలకొంది. ఏదైనా భేదాభిప్రాయాలు వచ్చినా ఖుర్‌ఆన్ మరియు హదీసు వెలుగులో మా సమస్యలు సింపుల్‌గా పరిష్కారమవుతున్నాయి.



చెప్పారు. బస్సు ఖర్చు ఎందకు అని కాలి నడకన పోతుంటే దారిలో ఐపిసి బోర్డు ఉన్న కార్యాలయం కనబడింది. బయట ఉచిత తెలుగు పుస్తకాల కోసం వెతుకుతుండగా ఒక వ్యక్తి లోనికి వెళ్ళు ఉంటాయని చెప్పాడు. మెట్లు దిగి ఆఫీసులోనికి వెళుతుంటే తెలుగు మాటలు నా చెవిన పడ్డాయి. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. అక్కడ ఇస్లాం గురించి అల్లాహ్ గురించి తెలుగులో వివరంగా చెబు తున్నారు. దీన్ విషయం అయినందువలన ధైర్యంగా క్లాస్ రోమ్‌లోనికి వెళ్ళాను. ప్రస్తుత **నెలవంక** ఎడిటర్ గారయినటువంటి సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ గారు పాఠం చెబుతున్నారు. నన్ను ఎంతో ఆప్యాయంగా స్వాగ తం పలికారు. అక్కడ చాలా మంది విద్యా ర్థులు ఉన్నారు. వారంతా న్యూ ముస్లిమ్స్ అని తరువాత తెలిసింది. సార్ గారు 'ఐపిసి క్లాసులకు వస్తుండండి మారడానికి తొంద రేమీ లేదు' అని ఇస్లాం గురించి బాగా అర్థ మయ్యే రీతి లో చెప్పారు. 2 శుక్రవారాలు క్లాసులకు హాజరయ్యాను. ఈ మధ్యలో డాక్టర్ జాకిర్ నాయక్ గారి ఇస్లాం ఔర్ ఈసాయియత్ డీవీడీలు చూసి మా ఇంటి వారికి ఫోన్ చేసి నేను ఇస్లాం స్వీకరిస్తున్నాని చెప్పాను. నీవు ఎప్పుడో స్వీక రించావు ఇప్పుడు కొత్తగా స్వీకరించడమే మిటని మా అమ్మ అన్నది. (ఆమే ఉద్దేశం ఏమంటే నేను ముందు నుండి ముస్లిం స్నేహితులతో ఎక్కువగా తిరుగుతుండే వాన్ని అందువలన అలా అన్నది).

సత్యాన్వేషణలో నా సుదీర్ఘ ప్రయాణం అల్లాహ్ అనుగ్రహం వలన ఫలించింది. నా మొదటి ప్రచార కార్యక్రమం నా ఇంటివారి తోనే మొదలు పెట్టాను. నా భార్యాపిల్లలు ఇస్లాం స్వీకరించారు. పిల్లలంటే చిన్నవారు కానీ భార్య మాత్రం నా పయనం నీతోనే అంటూ మనస్ఫూర్తిగా స్వీకరించింది. ఇప్పుడు నా భార్య పేరు షబానా పర్వీన్, పెద్ద కుమారుడు అబ్దుల్లాహ్, చిన్న కుమారుడు అఖ్జల్, పెద్ద కూతురు రుఖయ్యా, చిన్న కూతురు హఫ్సా.

విజ్ఞాన భాండాగారం ఖుర్‌ఆన్



ఖుర్‌ఆన్ అనే ఈ జ్ఞాన సాగరాన్ని వర్ణించడం ఎవరి తరమూ కాదు. ఈ గ్రంథ రాజం తెలియపర్చే యదార్థాల వరకు, అద్భుత విషయాల వరకు చేరుకోవడానికి మనకి ఎన్ని యుగాలు అవసరమో తెలియదు. ఈ గ్రంథ విశిష్టత గురించి కలం కదిలించి వ్రాయడం అంటే- కొన్ని కోణాలను మనిషికి తెలిసిన జ్ఞానం, అనుభవం కొద్దీ గ్రహించి చెప్పడమే అవుతుంది. ఈ గ్రంథ జ్ఞానాన్ని ఏ కలం, మరే పుస్తకం ద్వారానూ ఇనుమడింపజేయలేము. 'ఇమామ్ ఫఖ్రుర్రాజీ (ర)' ఇలా అభిప్రాయాపడ్డారు: "ఖుర్‌ఆన్ అనే ఈ విజ్ఞాన భాండాగారమే గనక లేక పోయినట్లయితే ప్రపంచం మూడు వందల ప్రయోజనకర విద్యలను కోల్పోయి ఉండేది".

ఆయన కాలం నాటికి విద్యల సంఖ్య బహుశా మూడు వందలే అయివుండొచ్చు. ప్రస్తుతం గనక మూడు వేలు, మూడు లక్షలు, లేదా అంతకు మించిన జన ప్రయోజనకర విద్యారకాలు ప్రాచుర్యంలో ఉన్నా వాటన్నింటికీ బీజ గ్రంథం పవిత్ర ఖుర్‌ఆనే అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ మాటే పరమ పవిత్రుడైన అల్లాహ్ తెలియజేస్తున్నాడు: "భూ మండలంలోని వృక్షాలన్నీ కలములుగా, సముద్రాలన్నీ సీరాగా మారినా, ఆపై వాటికి జతగా మరో ఏడు మహా సాగారాలను సీరాగా చేసినా అల్లాహ్ వాక్యాలు పూర్తి కావు. నిస్సందేహంగా అల్లాహ్ సర్వాధికుడు, వివేక వంతుడు". (లుఖ్మాన్: 27)

మచ్చుకు కొన్నింటిని ఇక్కడ పేర్కొనడం జగుతుంది.

Astronomy-ఖగోళశాస్త్రం: సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రాలు-మొదలయిన సమస్త రోదసీ వస్తువులు వేర్వేరుగా తమకు నిర్దేశించిన కక్ష్యల్లో తిరుగుతున్నాయన్న యదార్థాన్ని నేటికి 1432 సంవత్సరాల క్రితమే ఖుర్‌ఆన్ తెలియజేసింది.

"సూర్యుడు తన నిర్ణీత కక్ష్యలో సంచరిస్తున్నాడు. ఇది మహా శక్తిమంతుడు, అసాధారణ వివేకవంతుడయిన అల్లాహ్ రూపొందించిన (అద్భుత, అద్వితీయ) పథకం. చంద్రుని కోసం మేము మజిలీలను (చంద కళలలు) నిర్ణయించాము. అది వాటిని దాటుకుంటూ చివరికి ఎండి పోయిన ఖర్జూరపు మట్టలా మారిపోతుంది. చంద్రున్ని చేరుకునే శక్తి సూర్యుని లో లేదు. అలాగే రాత్రి పగటిని దాటిపోలేదు. సమస్తం ఒక్కొక్క కక్ష్యల్లో (వాటికి నిర్దేశించబడిన కక్ష్యల్లో) సంచరిస్తున్నాయి".

(దివ్య ఖుర్‌ఆన్- 36: 38-48)



దీన్ని బట్టి తెలిసేదేమిటంటే- ఈ విశ్వంలో ఏ రోదసీ వస్తువు స్థిరంగా లేదు. ప్రతి గ్రహం, ప్రతి నక్షత్రం, ప్రతి గెలాక్సి, ప్రతి క్వాజర్ తమ తమ నిర్ణీత కక్ష్యల్లో నిరంతరాయంగా సంచరిస్తున్నా యన్నది. పైగా ఇవన్నీ ఒకదానికొకటి ఢీ కొనడానికి వీలు లేని విధంగా దేవుడు నిర్దేశించిన కక్ష్యల్లో, ఆయన నిర్ణయించిన వేగాలతో ఎంతో క్రమబద్ధంగా తిరుగు తున్నాయి. కనుక సర్వలోక సృష్టికర్త, మహా శక్తిపరుడు, ఘనాఘనుడైన అల్లాహ్ ను మాత్రమే ఆరాధించాలని ఈ సూక్తి మానవాళికి పరోక్షంగా బోధిస్తున్నది.

మరో చోట ఇలా ఉంది: "మేము రేయింబవళ్ళను (మా శక్తి) సూచనలుగా చేశాము. రాత్రి సూచనను (మీ విశ్రాంతి కోసం) చీకటిమయంగా చేశాము. అలాగే మీ ప్రభువు అనుగ్రహం (జీవనోపాధి) అన్వేషించడానికి, నేలలు, సంవత్సరాల లెక్క చూసుకోవడానికి వీలుగా మేము పగటి సూచనను కాంతిమంతంగా చేశాము. ఈ విధంగా మేము ప్రతి విషయాన్నీ స్పష్టంగా విడమరచి చెప్పాము". (బనీ ఇస్రాయీల్: 12)



Natural physics– జీవ శాస్త్రం: ఈ విద్య వల్ల భూమి యొక్క వాస్తవ రూపాన్ని, దాని పూర్వ పరాల్ని గ్రహించవచ్చు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది: "భూమ్యాకాశాలు కలిసి ఉండగా, మేము వాటిని విడదీసిన వైనాన్ని (దైవం అనే అస్తిత్వం లేదని వాదించే నాస్తికులు) తిరస్కారులు చూడటం లేదా? అలాగే ప్రతి ప్రాణినీ మేము నీటితో సృజించిన విషయాన్ని వీరు గమనించడం లేదా? అయినప్పటికీ వారు విశ్వసించరేమి?". (అల్ అంబియా: 30)



పై ఆయతులో **'చూడటం'** అంటే – మనో నేత్రంతో చూడటం అని అర్థం. అలాగే **'నీటితో'** అనే పదాన్ని వర్షపు నీరుగా, కాలువ నీరుగా భావిస్తే దాని ప్రతి వస్తువుకు నవ జీవనం లభిస్తుందన్న విషయం విదితమే. ఒకవేళ 'వీర్య బిందువు'గా భావిస్తే ప్రతి ప్రాణీ దాంతోనే ఉనిలోకి వస్తుందన్న జగమెరిగిన సత్యం.

భూ విజ్ఞాన శాస్త్రం



"భూమి వారిని కుదిపివేయకుండా ఉండటానికని మేము అందులో పర్వతాలను పాతాము. వారు తమ మార్గాలను పొందటానికి అందులో సువిశాలమైన రహదార్లను ఏర్పరచాము". (15: 31)

భూగోళిక శాస్త్రం: "అందులో (భూమిలో) ప్రతి వస్తువును నిర్ణీత మోతాదులో మొలిపించాము. అందులోనే మేము మీ జీవనోపాధికి వనరులను సమకూర్చాము. ఇంకా మీరు జీవనోపాధి కల్పించని వాటికి కూడా. అన్ని వస్తువుల ఖజానాలు మా వద్దనే ఉన్నాయి. ప్రతి వస్తువును మేము తగు మోతాదులో అవతరింపజేశాము" (అల్ హిజ్ర్: 20, 21)

అలాగే వాన గురించి, గాలుల సంచారం గురించి ఆ పరమదాత అయిన అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నాడు: "మేము బరువైన గాలులను పంపిస్తున్నాము. మరి ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, దాన్ని మీకు త్రాపిస్తున్నాము. ఈ (జల) నిధిని సమకూర్చుకోవడం అన్నది మీ వల్ల కాని పని. ప్రాణం పోసేది, ప్రాణం తీసేది కూడా మేమే. (ఎట్టకేలకు) వారసులం కూడా మేమే." (అల్ హిజ్ర్:22, 23)



Botany వృక్ష శాస్త్రం: వృక్ష సంపద గురించి ఖుర్ ఆన్‌లో పలు చోట్ల ఎంతో విపులంగా, వివరణాత్మకంగా పేర్కొనడం జరిగింది. ఉదాహరణకు – "ఆయనే పందిళ్ళపై ప్రాకే, పందిళ్ళపై ఎక్కించబడని తోటలతో సహా రకరకాల తోటలు, తోపులను సృష్టించాడు. ఖర్జూర చెట్లను, రకరకాల ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసే పొలాలను సృజించినవాడు కూడా ఆయనే. ఆలివ్, దానిమ్మ వృక్షాలను సృజిస్తున్నవాడూ ఆయనే. వాటి పళ్ళు కొన్ని పరస్పరం పోలి ఉంటాయి, మరికొన్ని పోలి ఉండవు. (పోలిక ఒకటే అయినా రుచి మాత్రం వేర్వేరుగా ఉంటుంది). అవి పంటకు వచ్చినప్పుడు వాటి పండ్లను హాయిగా తినండి. దాంతోపాటు పంట కోతకు వచ్చినప్పుడు తప్పనిసరిగా చెల్లించవలసిన దాని హక్కును చెల్లించండి. దుబారా ఖర్చు చేయకండి. దుబారా చేసేవారిని అల్లాహ్ ప్రేమించడు". (అల్ అన్‌ఆమ్: 141)




Zoology– జంతు శాస్త్రం: "వీరు తమ మీద రెక్కలు జాపుతూ, ముడుస్తూ, ఎగిరే పక్షుల్ని పరికించి చూడటం లేదా? (అలా (వాటిని ఏ ఆధారం లేకుండా) పట్టి ఉంచిన వాడు కరుణామయుడు తప్ప మరెవరు లేరు". (అల్ ముల్క్: 19)



మిగతాది 11వ పేజీలో

అనురాగ రావం
సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

సైగలతో సత్యోపదేశం



ఎదుటి వ్యక్తికి విషయం బాగా అర్థం అయ్యేందుకుగాను దైవ ప్రవక్త (స) అప్పుడప్పుడు చేతి సైగతోనో, నేల మీద గీతలు గీసో విశదపర్చేవారు. ప్రవక్త (స) తన శిష్యుల్ని తర్ఫీదు ఇచ్చే నిమిత్తం ఈ విధానాన్ని అవలంబించినట్లు మనకు తెలుస్తుంది. చెప్పబోయే విషయం ప్రాముఖ్యతతో కూడినదై ఉండి, కేవలం చెప్పడం ద్వారా అర్థం చేసుకోవడం కష్టమనిపించినప్పుడు ప్రవక్త (స) వివిధ పద్ధతులను అవలంబించి విషయాన్ని విపులీకరించేవారు. ప్రవక్త (స) వారి ఈ విలక్షణ శిక్షణ ద్వారా తానేం చెయ్యాలో, తనకు సంబంధించిన విషయాలేమిటో ఎదుటి వ్యక్తి అవలీలగా అర్థం చేసుకునే వాడు.

హజ్రత్ నఫ్లా బిన్ సఅద్ (ర) కథనం – దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: 'నేను మరియు అనాథల బాగోగులు చూసుకునే వ్యక్తి స్వర్గంలో ఇలా ఉంటాము'. (ఆయన **'ఇలా'** అన్నప్పుడు) తన చూపుడు వ్రేలు మరియు మధ్య వ్రేలిని కలపకుండా కొంత సందు ఉంచి చూపించారు' అని రావీ పేర్కొన్నారు. (బుఖారీ)

ప్రవక్త (స) ఈ హదీసులో రెండు వ్రేళ్ళ సైగతోటి అనాథల వ్యవహారాన్ని చక్కబెట్టే వ్యక్తి విశిష్ఠతను తెలియజేయడంతోపాటు అతను మరియు ప్రవక్త (స) స్వర్గంలో ప్రక్కప్రక్కనే ఉంటారన్న గొప్ప శుభ వార్తను సయితం అందజేశారు. స్వర్గాన్ని సొంతం చేసుకునేందుకు తమ సర్వస్వాన్ని పణంగా పెట్టే సహాబాల ముందు అనాథ సంక్షేమ ఔన్నత్యాన్ని విశదపర్చి, సహాబాలను ఆ విధంగా అనాథల యోగక్షేమాలు తెలుసుకునే ఉత్తమ గణంగా తయారు చేశారు. మేము అనాథల్ని చేరదీసి ఎలాగైనా స్వర్గాన్ని సొంతం చేసుకోవాలన్న బలమైన కోరిక వారిలో జనించింది.

ఓ సారి సుఫ్యాన్ బిన్ అబ్దుల్లా బజలీ (ర) దైవ ప్రవక్త (స) వారి పవిత్ర సన్నిధికి వచ్చి – 'యా రసూలల్లాహ్! మీ దృష్టిలో నా కొరకు అతి ప్రమాదకరమైన వస్తువేదో సెలవియ్యండి' అని కోరగా; అందుకు సమాధానం ఇస్తూ– చేత్తో తన నాలుకను పట్టి చూపించి **'ఇది'** అన్నారు.

బుఖారీ ముస్లింలో హజ్రత్ అబూ మూసా (ర) కథనం – దైవ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: "విశ్వాసులు పరస్పరం ఒక కట్టడం లాంటివారు. అందులోని ఒక భాగం మరో భాగాన్ని బల పర్చినట్లే, ముస్లింలు పరస్పరం ఒండొకరిని అభిమానించడంలోనూ, ప్రేమించడంలోనూ అదే రీతిన వ్యవహరిస్తారు". (ఇలా ఉపదేశించినప్పుడు) ఆయన (స) తన రెండు చేతి వ్రేళ్ళను ఒక దానిలో ఒకటి జొప్పించి చూపించారు.


ఈ ప్రపంచంలో ముస్లింల మధ్య ఉండాల్సిన సమైక్యతా భావం గురించి ఉదాహరణ ఇచ్చి ఉపదేశించడమే కాక, చేతి వ్రేళ్ళను పరస్పరం కలిపి ఎదుటి వ్యక్తి మరింత సులువుగా సుస్పష్టంగా అర్థమయ్యేటట్లు చేశారు ప్రవక్త (స).

ఓ సారి దైవ ప్రవక్త (స) సహాబాల మధ్య కొలువుదీరి ఉన్నారు. అప్పుడు ఆయన (స) తన చేతితో నేల మిద ఒక సరళ రేఖను గీసి **'ఇది దైవ మార్గం'** అన్నారు. ఆ దరిమిలా ఆ సరళ రేఖ కుడి వైపు రెండు గీతలు, ఎడమ వైపు రెండు గీతలు గీసి **'ఈ గీతలు షైతాన్ మార్గాల'**న్నారు.



ఆ తార్వాత దైవ ప్రవక్త (స) సరళ రేఖ మీద చెయ్యి పెట్టి ఖుర్ఆన్‌లోని ఈ ఆయతును పఠించారు: **"వ అన్న హాజా సిరాతీ ముస్తఖీమన్....."** ఇదే నా రుజు మార్గము కనుక మీరు దీనినే అనుసరించండి. ఇతరత్రా మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని దైవ మార్గం నుండి వేరు పరుస్తాయి. మీరు భయభక్తుల వైఖరిని అవలంబించేందుకుగానూ అల్లాహ్ మీకు ఈ విధంగా తాకీదు చేశాడు". (అన్‌ఆమ్: 153)

అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (ర) కథనం – దైవప్రవక్త (స) మా అందరి శిక్షణార్థం చతురస్రాకారపు గీతలు గీశారు. దాని మధ్యలో నుండి బయటికి వచ్చేలా మరో పెద్ద గీతను గీశారు. దానికి (మధ్యనున్న గీతకు) ఆనుకొని (ప్రక్కన) ఇంకొన్ని చిన్న గీతలు గీశారు. ఆ తర్వాత ఇలా అన్నారు:



"ఈ గీత మానవుడు. అతని చుట్టూ ఉన్న ఈ చతురస్రాకారపు గీతలు అతని చావు. బయటకు వెళుతున్న ఈ గీత అతని కోరికలు. ఈ చిన్ని చిన్ని గీతలు మనిషికి ఎదురయ్యే విపత్తులు. ఒక ప్రమాదం తప్పినా మరో ప్రమాదం, మరో గండం అతనిపై విరుచుకు పడుతుంది. ఒక గండం నుండి గట్టెక్కినా మరో ప్రమాదంలో చిక్కుకుంటాడు". (బుఖారీ)



మానవ జీవితం విపత్తుల వలయం. మనిషికి ఎప్పుడూ ఏదో ఒక రకమైన ఆపదలు వస్తూనే ఉంటాయి. ఈ పోరాటంలోనే అతని జీవితం అంతమవుతుంది. అయినా ఇటువంటి అనిశ్చిత జీవితంలోనే మనిషి అంతులేని కోరికలు కోరుకుంటాడు. మనిషిలోని ఈ ఐహిక లాలసను ఖుర్‌ఆన్ ఇలా అభివర్ణిస్తుంది: "(ఓ ప్రవక్తా!) జీవితం పట్ల అందరికన్నా ఎక్కువగా వ్యామోహం వీరి (యూదుల)కే ఉందన్న విషయాన్ని నువ్వు గ్రహిస్తావు. (జీవితం పట్ల వ్యామోహంలో) వీరు బహుదైవారాధకుల (ముష్రికుల)ను కూడా మించిపోయారు. వీరిలోని ప్రతి ఒక్కడూ వెయ్యి సంవత్సరాల వయస్సును కోరుకుంటాడు. అయితే ఈ దీర్ఘాయుషు కూడా వారిని శిక్ష బారి నుండి ఏ మాత్రం తప్పించజాలదు". (బఖరా: 96)

అంటే మనిషి తన మనో వాంఛల దాస్యానికి గురై ధన దాహంలో, విగ్రహ వ్యామోహంలో పడి నిజ దైవాన్ని, ధర్మాన్ని విస్మరించి సైతానే సిగ్గుపడేలా, విస్మయానికి లోనయ్యేలా వ్యవహరిస్తాడు. అతను తన కోరికల వెంట ఎంత పరుగులు తీసినా చివరికి మిగిలేది పరాభవమే, శూన్యమే. తీరిన ప్రతీ కోరిక మరో కోరికను వెంటేసుకుని వస్తుంది కనుక, అతని కోరికలు ఎన్నటికీ తీరవు. చివరికి అతనిపై మృత్యువు పంజా విసురుతుంది. అంచేత మనిషి ఎన్నడూ చావు పట్ల ఏమరుపాటుకి లోను కాకూడదు. దైవ అవిధేయతకు పాల్పడ కూడదు అని దైవ ప్రవక్త (స) ఎంత సమ్మోహనాత్మక రీతిలో చెప్పారో చూడండి!

దైవ ప్రవక్త (స) ఓ సందర్భాన ఇలా అన్నారు: "ఏడు రకాల దుస్థితులు దాపురించక ముందే మంచి పనులు చేయడంలో త్వర పడండి. ఏమిటి మీరు మిమ్మల్ని (ధర్మాన్ని) మరచిపోయేటట్లు చేసి వేసే పేదరికం కోసం నిరీక్షిస్తున్నారా? లేదా హద్దులను అతిక్రమించేలా పురిగొల్పే కలిమిని కోరుకుంటున్నారా? లేక మీ ఆరోగ్యాన్ని పాడు చేసే మహమ్మారి రోగం కోసం ఎదురు చూస్తున్నారా? లేదా బుద్ధివివేకాల్ని గాడి తప్పించే వృద్ధాప్యం కోసం పడిగాపులు కాస్తున్నారా? లేక తృటిలో ప్రాణాల్ని హరించే మరణం కోసం నిరీక్షిస్తున్నారా? లేదా దజ్జాల్ రాక కోసం ఎదురు చూస్తున్నారా? అతడు నిరీక్షించబడుతున్న అగోచరాల్లోకెల్లా అత్యంత ప్రమాదకరమైనవాడు. లేక ప్రళయం కోసం ఎదురు చూస్తున్నారా? ప్రళయం – అది మహా భయంకరమైనది, అత్యంత చేదైనదీను". (తిర్మిజీ)

విజ్ఞాన భాండాగారం ....
(9వ పేజీ తరువాయి భాగం)

Natural histry: "భూమిలో సంచరించే ఎన్ని రకాల జంతువులైనా, తమ రెండు రెక్కల సహాయంతో ఎగిరే పక్షులైనా – అన్నీ మీ వంటి సముదాయాలే". (అల్ అన్‌ఆమ్: 37)



Chemistry–రసాయన శాస్త్రం: "ఈ రంగంలో మార్గదర్శకం కాగలిగే సూత్రాలు అనేకం ఖుర్‌ఆలో ఉన్నాయి. ఉదాహరణకు – "మీ కోసం పశువులలో కూడా గొప్ప గుణ పాఠం ఉంది. వాటి కడుపులో ఉన్న పేడకు – రక్తానికి మధ్యలో నుంచి స్వచ్ఛమైన పాలు మీకు తాపిస్తున్నాము. త్రాగేవారికి అది కమ్మగా ఉంటుంది." (అన్ నహ్ల్: 66)

'నీ ప్రభువు తేనెటీగకు ఈ సంకేతమిచ్చాడు: "కొండల్లో, చెట్లల్లో, ప్రజలు కట్టుకున్న ఎత్తైన పందిళ్ళలో నీ ఇండ్లను (తేనె తెట్టలను) నిర్మించుకో. అన్నీ రకాల పండ్లు తిను. నీ ప్రభువు సులభతరం చేసిన మార్గాలలో విహరిస్తూ ఉండు." వాటి కడుపులలో నుంచి పానకం ఒకటి వెలువడుతుంది. దాని రంగులు వేర్వేరుగా ఉంటాయి. అందులో ప్రజలకు స్వస్థత ఉంది. ఆలోచించేవారి కోసం ఇందులో గొప్ప సూచన ఉంది'. (అన్ నహ్ల్: 68, 69)



Agri culture: వ్యవసాయం, సేద్యం గురించి ఎంతో గొప్ప సూచన – "మెరక ప్రాంతంలో ఉన్న తోట. భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. దానిపై పెద్దగా వాన కురియకపోయినా, సన్నటి జల్లు పడినా సరిపోతుంది". (బఖరా: 265)

Embryo - Feotus; గర్భస్థ శిశువు: "ఆయన మిమ్మలందరినీ ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. మరి దాంతోనే దాని జతను కూడా చేశాడు. ఇంకా మీ కోసం పశువులలో ఎనిమిది (రకాల జతలను) పెంటి – పోతులను అవతరింపజేశాడు. ఆయన మిమ్మల్ని మీ మాతృ గర్భాలలో –మూడేసి చీకట్లలో – ఒకదాని తర్వాత ఒకటిగా రూపకల్పన చేస్తున్నాడు". (అజ్ జుమర్: 12 –14)

Source: Miraculous Mixture:
Mother's Milk By HARUN YAHYA

అమ్మ పాలు అమృతం

తల్లి పాలలో పోషక విలువలు మెండుగా ఉండటమే కాకుండా, బేబీ యొక్క అతి సున్నితమైన జీర్ణవ్యవస్థచే అవి సులభంగా జీర్ణం కాబడతాయి. ఆ విధంగా వాటిని జీర్ణం చేసుకోవడానికి బేబీకి తక్కువ శక్తిసరిపోవడం వలన, మిగిలిన శక్తి శరీరం యొక్క ఇతర విధుల,పెరుగుదల, అవయాల అభివృద్ధి కొరకు ఉపయోగపడు తుంది.



(అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు): "మేము మానవునకు తన తల్లిదండ్రుల యెడల మంచి తనంతో మెలగటం విధిగా జేశాము. అతని తల్లి అతనిని బలహీనతపై బలహీనతను సహిస్తూ (తన గర్భంలో) భరిస్తుంది. మరియు ఆ బిడ్డ చనుపాలు మాన్పించే గడువు రెండు సంవత్సరాలు. నీవు నాకు మరియు నీ తల్లి తండ్రులకు కృతజ్ఞుడై ఉండు. నా వైపునకే నీవు మరలి రావలసి ఉన్నది"

(ఖుర్ఆన్ 31:14)

పసిపాపకు పోషక అవసరాలను తీర్చడానికి మరియు అవకాశమున్న ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడానికి తల్లిపాలు రూపంలో పోల్చలేని మిశ్రమ పదార్థాన్ని అల్లాహ్ సృష్టించాడు. తల్లి పాలలోని పోషక పదార్థాల సమతుల్యం సరియైన స్థాయిలో ఉంటుంది. పసిపాపకు అన్ని విధాల ఈ పాలు సరిపోతాయి.

అంతే కాకుండా నరాల వ్యవస్థ అభివృద్ధి మరియు మెదడు కణాల పెరుగుదల త్వరితం కావడానికి ఉపయోగపడే పోషకాలతో తల్లి పాలు నిండి ఉంటాయి. పసిపిల్లల కొరకు నేటి టెక్నాలజీ ద్వారా తయారు చేసే కృత్రిమ ఆహారం, తల్లిపాల వంటి అద్భుత ఆహారం అవసర లోటును భర్తీ చేయలేదు.

తల్లిపాల వలన కలిగే లాభాల జాబితాలో ప్రతీ రోజూ కొత్త విషయాలు చేరుతూనే ఉన్నాయి. ప్రత్యేకంగా ఉదరశోక (రెస్పిరేటరీ) మరియు జీర్ణ వ్యవస్థలకు సంబంధించిన ఇన్ఫెక్షన్ల నుండి పసిపాపలను తల్లిపాలు రక్షిస్తాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. ఇది ఎలా అంటే, తల్లిపాలలోని యాంటీ బాడీస్ ప్రత్యక్షంగా ఇన్ఫెక్షన్లతో పోరాడ తాయి.

ఇన్ఫెక్షనని ఎదుర్కొనే తల్లిపాలలోని ఇతర లక్షణాలు మేలు చేసే బాక్టీరియా (నార్మల్ ఫ్లోరా) ఉండటానికి అనువైన వాతారవణాన్ని ఏర్పరుస్తాయి. ఆ విధంగా హానికలిగించే పరాన్న జీవులు, వైరస్‌లు, బాక్టీరియాలకు అడ్డుగా నిలుస్తాయి. అంతేకాకుండా నిరూపితమైన మరో విషయం ఏమిటంటే, తల్లి పాలలోని అంశాలు అంటురోగ వ్యాధులకు వ్యతిరేకంగా ఇమ్యూన్ సిస్టమ్‌ని ఏర్పరచడమే కాకుండా దానిని సవ్యంగా పని చేసేలా చేస్తాయి.

తల్లిపాలు ప్రత్యేకంగా తయారు చేయబడ్డాయి కనుక, పసిపిల్లలకు ఇది చాలా సులభంగా జీర్ణమయ్యే ఆహారం, తల్లి పాలలో పోషక విలువలు మెండుగా ఉండటమే కాకుండా, బేబీ యొక్క అతి సున్నితమైన జీర్ణవ్యవస్థచే అవి సులభంగా జీర్ణం కాబడతాయి. ఆ విధంగా వాటిని జీర్ణం చేసుకోవడానికి బేబీకి తక్కువ శక్తిసరిపోవడం వలన, మిగిలిన శక్తి శరీరం యొక్క ఇతర విధుల,పెరుగుదల, అవయాల అభివృద్ధి కొరకు ఉపయోగపడు తుంది.

కొంతమంది పిల్లలు నెలలు నిండకుండానే పుడతారు. అలాంటి పిల్లలను ప్రసవించిన తల్లుల పాలలో ఆ పిల్లల అవసరానికి సరిపోయేలా ఎక్కువ మోతాదులో కొవ్వు, ప్రొటీన్, సోడియం, క్లోరైడ్ మరియు ఐరన్ ఉంటాయి. ఇలాంటి పిల్లలలో 'కళ్ళ'కు సంబంధించిన విధులు చాలా బాగా అభివృద్ధి చెందేది తల్లిపాల వల్లనేనని తెలుసుకున్నారు. అంతే కాకుండా అటువంటి పిల్లలు ఇంటెలిజెన్స్ పరీక్షలలో బాగా రాణించారు.

తల్లిపాల వలన ఇంకా చాలా ఉపయోగాలున్నాయి. పుట్టిన బిడ్డ అభివృద్ధికి సంబంధించిన వాటిలో అతి ముఖ్యమైనది తల్లి పాలు. ఇది వాస్తవం. ఎందుకంటే ఇందులో ఒమేగా – 3 ఆయిల్ అల్ఫాలైనోలీక్ యాసిడ్స్ ఉంటాయి. ఇది మెదడుకు మరియు రెటీనాకు చాలా ముఖ్యమైన మిశ్రమపదార్థమే కాకుండా, కొత్తగా పుట్టిన పిల్లల దృష్ట్యా దీనికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఒమేగా–3కి సహజమైన మరియు పరిపూర్ణమైన స్టోర్ తల్లిపాలు. అంతే కాకుండా తల్లిపాల వలన దీర్ఘ కాలిక ప్రయోజనాలున్నాయని, అవి ఏమి టంటే బ్లడ్ ప్రెషర్‌పై మంచి ప్రభావాన్ని కలిగి ఉండి, గుండెపోటు సమస్యను తగ్గిస్తుందని బ్రిస్టల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు తెలియ జేశారు.

మెడికల్ జర్నల్ 'సర్క్యులేషన్'లో ప్రచురించిన పరిశోధనా ఫలితాలను బట్టి తల్లి పాల వలన పెరిగే బిడ్డలో గుండె సంబంధిత వ్యాధులు రావడం తక్కువని తెలుస్తుంది.తల్లి పాలలో పోలీ అను సాట్యురేటెడ్ ఫేటీ యాసిడ్ల పొడవాటి చైన్ ఉండటం వలన, అది ఆర్టెరీస్ గట్టి పడకుండా నిరోధిస్తుంది. తల్లి

తల్లిపాలు త్రాగి పెరిగిన పిల్లలలో ఐ.క్యూ 5 పాయింట్లు ఎక్కువగా ఉందని తెలుసు కున్నారు. 6 నెలల వరకూ తల్లిపాలు త్రాగిన పిల్లలకు ఇంటెలిజెన్స్‌కు ప్రయోజనం కలుగుతుంది.

అమెరికాలోని (Cincinnati) చిన్న పిల్లల హాస్పిటల్ మెడికల్ సెంటర్ టీమ్‌కి నాయకత్వం వహించిన డా.లిసా మార్టిన్, (adipo nectin) అనే ప్రొటీన్ హార్మోన్ అధిక మోతాదులో తల్లిపాలలో ఉన్నట్లు కనుగొన్నారు. రక్తంలో అధిక మోతాదులో (adiponectin£) ఉంటే హార్ట్ ఎటాక్ సమస్య తగ్గుతుంది. హార్ట్ ఎటాక్‌కు ఎక్కువగా కారణమయ్యే స్థూలకాయం కలవారిలో (adiponectin) తక్కువ స్థాయిలో ఉంటుంది.

ఈ హార్మోన్ వలన స్థూలకాయ సమస్య తల్లి పాలతో పెరిగిన పిల్లలలో తక్కువగా ఉంటుందని తెలుసుకున్నారు. లెప్టిన్ అనే మరో హార్మోన్‌ను కూడా తల్లి పాలలో కనుగొన్నారు. ఇది (fat metabolism)లో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

శరీరంలో కొవ్వు ఉందని మెదడు సంకేతమిచ్చేది లెప్టిన్ అని నమ్ముతారు. డా. మార్టిన్ ప్రకటనను బట్టి, పసిప్రాయంలో తల్లిపాల నుండి గ్రహించబడిన ఈ హార్మోన్‌లు స్థూలకాయం, టైప్ 2 డయాబెటిస్ మరియు ఇన్సులిన్ నిరోధక శక్తి మరియు కరోనరీ ఆర్టెరీ మొదలైన వ్యాధుల సమస్యలను తగ్గిస్తాయి.

తాజా ఆహారం గురించి వాస్తవాలు

తల్లిపాలకు సంబంధించిన నిజాలు పైన చెప్పిన వాటితో పూర్తయి పోలేదు. బిడ్డ పెరుగుతున్నప్పుడు, ఆ పెరిగే దశలను బట్టి, ఆ దశలకు సరిపోయే ఆహారం అవసరమౌతుంది. దానికి తగ్గట్టుగా పాలలోని పోషక పదార్థాలు ఈ ప్రత్యేక అవసరాలకు సరిపోయే విధంగా మారుతూ ఉండాలి. ఆ విధంగానే బిడ్డ ఎదుగుదలను బట్టి తల్లి పాలలో ఉండే పదార్థాలు మారుతూ ఉంటాయి.

తల్లి పాలు అన్ని సమయాలలో సరియైన ఉష్ణోగ్రత (వేడి)లో లభ్యమౌతాయి. మెదడు అభివృద్ధిలో ఇది కీలక పాత్ర వహిస్తుంది. ఎలా అంటే పాలు తనలో కలిగి ఉండే సుగర్ మరియు కొవ్వు (fat) వలన. దీనితో పాటు, కాల్షియం వంటి మూలకాలు బిడ్డ ఎముకల అభివృద్ధిలో ప్రముఖ పాత్ర వహిస్తాయి.

'పాలు' అని పిలువబడుతున్నప్పటికీ, ఈ అద్భుత మిశ్రమ పదార్థంలో ఎక్కువ శాతం నీరే ఉంటుంది. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఆహారంతోపాటు, పసిపిల్లలకి నీటి రూపంలో ద్రవం కూడా కావాలి. తల్లిపాలకంటే పరిశుభ్రమైన నీరు గాని, ఆహారపదార్థాలు గాని తయారుకాలేదు. తల్లిపాలలోని 90 శాతం నీరు పరిశుభ్రమైన వాతావరణంలో బిడ్డ అవసరాన్ని తీరుస్తుంది.

కొలోస్ట్రమ్

కొలోస్ట్రమ్ అనేది బిడ్డకు జన్మనిచ్చాక ప్రారంభంలో తల్లి స్తన్యాల నుండి వచ్చే ద్రవం. సాధారణ తల్లి పాలకంటే, దీనిలో అధికంగా ప్రోటీన్లు, ఎ-విటమిన్, సోడియమ్ క్లోరైడ్ మరియు యాంటీబాడీస్ (anti bodies) ఉంటాయి. తక్కువ మోతాదులో కార్బో హైడ్రేట్లు, లిపిడ్లు మరియు పొటాషియం ఉంటాయి. అప్పుడే పుట్టిన బిడ్డ యొక్క జీర్ణ వ్యవస్థ చాలా చిన్నదిగా ఉంటుంది. అటు వంటి సమయంలో బిడ్డకు తక్కువ మరి మాణంలో ఎక్కువ పోషకాలున్న ఆహారం కావాలి. ఆ అవసరాన్ని కొలస్ట్రమ్ తీరుస్తుంది. బిడ్డకు జాండిస్ రాకుండా కాపాడుతుంది. తల్లి గర్భంలో ఉన్నప్పుడు, తల్లి రోగ నిరోధక శక్తే బిడ్డను కాపాడుతుంది. ప్రసవించాక, ఈ కొలస్ట్రమ్ వ్యాధికారకాల నుండి బిడ్డను కాపాడుతుంది.

తల్లిపాలు మరియు ఇంటెలిజెన్స్

ఇతర పిల్లల కంటే తల్లిపాలు త్రాగిన బిడ్డలోనే జ్ఞానాభివృద్ధి ఎక్కువగా ఉంటుందని శాస్త్రీయ పరిశోధనలు తెలియజేస్తున్నాయి. జేమ్స్ డబ్ల్యూ ఆండర్‌సన్ (కెంటకీ యూనివర్శిటీ ఎక్స్‌పర్ట్) తల్లిపాలు త్రాగిన పిల్లలకు, కృత్రిమ ఆహారాన్ని తీసుకున్న పిల్లలకు మధ్య తులనాత్మక అధ్యయనం చేశారు.

తల్లిపాలు త్రాగి పెరిగిన పిల్లలలో ఐ.క్యూ 5 పాయింట్లు ఎక్కువగా ఉందని తెలుసు కున్నారు. 6 నెలల వరకూ తల్లిపాలు త్రాగిన పిల్లలకు ఇంటెలిజెన్స్‌కు ప్రయోజనం కలుగుతుంది. 8 వారాలకంటే తక్కువ కాలం పాటు పాలు త్రాగిన వారికి ఐ.క్యూ ప్రయోజనం లేదు.

తల్లిపాలు కాన్సర్‌ని ఎదుర్కొంటాయా?

కాన్సర్ నుండి తల్లిపాలు కాపాడతాయని నిరూపించబడింది. ఈ విషయం పై ఎన్నో పరిశోధనా పత్రాలు ప్రచురించబడ్డాయి. అయితే ఇది ఎలా జరుగుతుందో, ఆ మెకానిజమ్ గురించి ఇంకా పూర్తిగా తెలుసుకోవలసి ఉంది.

లేబొరేటీరీలలో జరిపిన పరీక్షల వలన తెలిసినదేమిటంటే, తల్లిపాలలోని ప్రోటీన్ ఆరోగ్యంగా ఉండే కణాలను నష్టం కలిగించకుండా కేవలం ట్యూమర్ కణాలనే చంపుతుంది. స్వీడన్‌లోని లండ్ యూనివర్శిటీ క్లినికల్ ఇమ్యూనాలజీ ప్రొఫెసర్ Catharina Svanborg ఓ పరిశోధనా బృందానికి నాయకత్వం వహించారు. వీరే తల్లిపాల యొక్క ఈ అద్భుత రహస్యాలను కనుగొన్నారు. తల్లిపాలు ఎన్నో రకాల కాన్సర్ల నుండి రక్షించడం ఓ అద్భుత పరిశోధనగా ఈ బృందం వర్ణించింది.

ప్రారంభంలో, కొత్తగా జన్మించిన పిల్లల ప్రేవుల నుండి మ్యూకస్ కణాలను తీసుకుని, వాటిని తల్లిపాలతో ట్రీట్ చేశారు. వారు గమనించింది ఏమిటంటే pneumococcus అనే బాక్టీరియా ద్వారా వచ్చే 'న్యూమోనియా' వ్యాధి ని, తల్లిపాలు efficient గా ఆపడాన్ని గమనించారు.

అల్లాహ్ నుండి అందిన ఈ బహుమతి - పోల్చలేని ఓ వరమే! బేబీ పాలిట దివ్యామృతమే!!

తల్లిపాల యొక్క మరొక అద్భుత అంశమేమిటంటే, రెండు సంవత్సరాల పాటు తల్లిపాలు త్రాగితే అది బిడ్డకు చాలా ప్రయోజనకారి అవుతుంది. ఈ విషయం ఈ మధ్య కాలంలోనే సైన్స్ ద్వారా కనుగొనబడింది.

అయితే; ఈ విషయాన్ని అల్లాహ్ 1432 సంవత్సరాల క్రితమే క్రింది ఖుర్‌ఆన్ వాక్యం ద్వారా తెలియజేశాడు:

"పూర్తి రెండు సంవత్సరాల పాల గడువు పూర్తి చేయవలెనని కోరినట్లయితే, తల్లులు తమ పిల్లలకు పాలివ్వాలి".

(ఖుర్‌ఆన్ 2:233)

ఇదే విధంగా, బిడ్డ అవసరాలకి అన్ని విధాల సరిపోయే సరియైన పోషకాలుండే పాలను, ఆ పాల ఉత్పత్తిని తల్లి నిర్ణయించలేదు. పాలలో వివిధ పోషక పదార్థాల స్థాయిని కూడా తల్లి నిర్ణయించలేదు. ఇది సర్వ శక్తిమంతుడైన అల్లాహ్‌కే తెలుసు. ప్రతీ జీవి యొక్క అవసరాలు, ప్రతీ జీవిపై చూపవలసిన కరుణ గురించి ఆయనకే తెలుసు. ఆయనే తల్లి శరీరంలో పాలను సృష్టించింది. కాబట్టి ఏదో అనుకోకుండా తయారు కాలేదు ఇది. ఈ సృష్టినంతటినీ ఓ పద్ధతిలో సృష్టించిన సృష్టికర్త ఖచ్చితంగా ఉన్నాడు. ఆయన ఒకే ఒక్కడు.

(శాంతి బాట సౌజన్యముతో)

ఫ్రీ పేరిమేషన్



మేధకు మేత

- ఖాలిద్ బిన్ వలీద్ – అమర్ బిన్ ఆస్ – ఉస్మాన్ బిన్ తల్హా ముగ్గురూ హిజ్రీ శకం 8వ సంవత్సరంలో ఇస్లాం స్వీకరించారు.
- ప్రళయ దినాన శంఖం ఊదే దైవదూత **'ఇస్రాఫీల్'.**
- వర్షాలు కురిపించే దైవదూత **'మీకాయీల్'.**
- ప్రాణాలు తీసే దైవదూత **'మలకుల్ మౌత్'.**
- ప్రవక్తల వద్ద దైవ వాణి తీసుకువచ్చే దైవదూత **'జిబ్రాయీల్'.**
- ముగ్గురు జన్మించలేదు, కాని సృష్టించబడ్డారు: (1) సాలెహ్ (అ) ఒంటె.(2) మూసా (అ) పాము.(3) ఇబ్రాహీం (అ) పొట్టేలు.
- హిజ్రీ రెండవ సంవత్సరంలో జకాత్ విధిగా నిర్ణయించబడింది.
- ప్రవక్త యాఖూబ్(అ) కు సంతానం 12 మంది.
- ఖిబ్లా మారిన తరువాత చేయబడిన తొలి నమాజు అసర్ నమాజు.
- ఉమర్ బిన్ ఖత్తాబ్(ర) దైవదౌత్యపు 6వ సంవత్సరములో ఇస్లాం స్వీకరించారు.
- అల్లాహ్ భూమ్యాకాశాలను 6 రోజులలో సృష్టించాడు.
- దైవప్రవక్త(స) సతీమణి హజ్రత్ ఖదీజ(ర) దైవదౌత్యపు 10వ సంవత్సరంలో పరమపదించారు.

సౌభాగ్యవంతులు ఆ ముగ్గురు

▼ ముగ్గురిని అల్లాహ్‌తో సంభాషించే భాగ్యం లభిస్తుంది. 1) ఏనాడైనను మదిలో వ్యభిచారం గురించి ఆలోచించనివాడు. 2) తన సంపాదనను వడ్డీ, లంచం మరియు ఇతరత్రా అక్రమాల నుండి కాపాడుకున్నవాడు. 3) ఎన్నడూ ఎవరి గురించైనా పల్లెత్తు మాట అననివాడు. చాడీలు చెప్పని వాడు.

▼ ప్రళయ దినాన జనమంతా, జగమంతా తమ తమ లెక్కలు చూసుకోవడంలో లీనమై ఉంటారు. అయితే ముగ్గురు మాత్రం దైవ సింహాసన నీడలో ప్రశాంతంగా ఓలలాడుతూ ఉంటారు. 1) సత్యం, ధర్మం విషయంలో ఏ ఒక్కరి విమర్శనుగానీ, దూషణనుగానీ ఖాతరు చేయని వాడు. 2) అధర్మ సంపాదన వైపుగానీ, అధర్మ విషయాల వైపుగానీ దృష్టి సారించనివాడు. 3) పరస్త్రీల వైపు ఒక్కసారి కూడా చెడు చూపు చూడనివాడు.

▼ముగ్గురిని అల్లాహ్ తన ప్రియతములుగా పేర్కొన్నాడు. 1) లోకమంతా గాఢనిద్రలో ఉన్న నిశిరాత్రి వేళ లేచి ఖుర్‌ఆన్ పారాయణం చేసే వ్యక్తి. 2) కుడి చేతితో చేసిన దానం ఎడమ చేతికి తెలియనంత గుప్తంగా దానాలు చేసే వ్యక్తి. 3) ధర్మ రక్షణకై చేసే పోరాటంలో (రణ భూమిలో) యుద్ధ వీరులు తనను ఒంటరిగా వదలి వెళ్ళినా ధర్మ రక్షణకై బార చాచి ధైర్యంగా శత్రువులను ఎదుర్కొనే వ్యక్తి.

దైవ ప్రవక్త (స) వారి దీవెన

- తన నాలుకను అదుపులో ఉంచుకునే వ్యక్తిపై దైవ కారుణ్యం కురియు గాక!
- ధర్మ సంపాదన గల వ్యక్తిపై అల్లాహ్ తన కారుణ్యాన్ని వర్షింపజేయు గాక!
- తక్కువ మాట్లాడే వ్యక్తిని (మిత భాషిని), ఎక్కువ దానధర్మాలు చేసే వ్యక్తిని (దానశీలుడ్ని) దైవం కటాక్షించుగాక!
- నా ప్రవచనాన్ని (హదీసును) విని, దాన్ని అతనికన్నా మించి గుర్తు పెట్టుకునే, పాటించే వ్యక్తికి చేరవేసేవానిపై దైవ కారుణ్య జల్లు కురియు గాక!
- మంచి మాట పలికి, ఏ ఒక్కరి తప్పిదాలను ఎంచకుండా, అందరి శ్రేయాన్ని కోరే వ్యక్తిని అల్లాహ్ తన కరుణ ఛాయల్లో చోటు కల్పించు గాక!
- మంచి కార్యంలో కుమారునికి చేయూతనందించే తండ్రిని అల్లాహ్ కటాక్షించుగాక! దయాహృది గల వ్యక్తిపై అల్లాహ్ కృప కలుగుగాక!
- ఈ మూడు గుణాలు ఎవరిలోనైతే నాటుకుపోతాయో వారు విశ్వాస మృదు మాధుర్యాన్ని ఆస్వాదించినవారవుతారు. 1) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)ను, తన-ధన-మానాలకంటే ఎక్కువగా అభిమానించాలి. 2) ఎవరితో స్నేహం చేసినా అల్లాహ్ ప్రసన్నత కోసం మాత్రమే చేయాలి. 3) నిప్పుల్లో నెట్టేయబడటాన్ని ఎలాగేతై అసహ్యించుకుంటారో అదే రీతిలో ఇస్లాం స్వీకరించాక దైవ అవిధేయత (కుఫ్ర్)ను అసహ్యించుకోవాలి.

మీకు తెలుసా?

- హమ్జ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ దైవదౌత్యపు ఆరవ సంవత్సరం ఇస్లాం స్వీకరించారు.
- దైవప్రవక్త(స) పిన తండ్రి అబుతాలిబ్ దైవదౌత్యపు పదవ సంవత్సరములో మరణించారు.
- దైవదౌత్యం తరువాత మొట్టమొదట నిర్మించబడిన మస్జిద్ మస్జిదె ఖుబా.

మాటల ముత్యాలు

- ఒక దాసుడు తోటి సోదరునికి సాయపడుతూ ఉన్నంతకాలం దేవుడు అతన్ని ఆదుకుంటూనే ఉంటాడు. (ముస్లిం)
- ఎవరయినా ఒకరికి శ్రేయస్కరమైన, మేలుతో కూడుకున్న మార్గాన్ని చూపిస్తే అతనికి సయితం సన్మార్గాన్ని అవలంబించిన వానికి సమానంగా పుణ్యం లభిస్తుంది. (ముస్లిం)
- ఖర్చు చేయడంలో సమతౌల్యం పాటించి, అత్యవసర సమయం కోసం పొదుపు చేసి పెట్టాలి.
- నేలపైనున్న వారిపై దయ జూపండి. నింగిపైనున్నవాడు మీపై కనికరిస్తాడు.





ముహమ్మద్ సలీమ్ జామయీ

ఓ ముస్లిం యువతీ!

హిజాబ్ అల్లాహ్ ఆదేశించిన ఒక విధి. మహిళల సంరక్షణ కొరకు, యువకుల్లో దుష్టభావాలు రేకెత్తకుండా ఉండటానికి, సమాజంలో విలవలు నిండు వలవలు ధరించి పరిధవిల్లేందుకు అల్లాహ్ దీనిని విధి గావించాడు.

ఓ యువతీ! నీవు తప్పనిసరిగా హిజాబ్ ధరిస్తూ ఉంటావనీ, నీ మనసులో ధృఢ నిర్ణయం తీసుకొని అల్లాహ్‌తో మరొకసారి ప్రమాణం చేయి. అల్లాహ్ అనుగ్రహించిన ఈ సంప్రదాయాన్ని ప్రేమిస్తానని వాగ్దానం చేయి. దేవ అవిధేయతా కార్యాలకు దూరంగా ఉంటానని, సజ్జనులైన చెలికత్తెలతో స్నేహం చేస్తానని కూడా ప్రతిజ్ఞ చేయ్యి. ఎవరైతే పరలోక శుభాలను, సౌభాగ్యాలను తన సొంతం చేసుకోవాలనుకుంటారో, వారు దాని విలువను ప్రపంచంలో చెల్లించాల్సి ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకో!

వేసవి సెలవుల్లో నా టైంటేబుల్

అల్లాహ్ నన్ను ఇస్లాం ధర్మాచరణ గల కుటుంబంలో పుట్టించి గొప్ప ఉపకారమే చేశాడు. మా నాన్న గారు మా అందరి కోసం వేసవి సెలవుల్లో సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న విషమై ఓ టైం టేబుల్ తయారు చేసి ఇచ్చారు. బహుశా మీకూ పనికొస్తుందని ఇక్కడ పేర్కొంటున్నాను.

1) ఉదయాన్నే **'అల్‌హమ్దులిల్లాహిల్లజీ అహ్యానా బఅదమా అమాతనా వ ఇలైహిన్నుషూర్'** అంటూ లేవాలి. ఫజ్ర్ నమాజు చదవాలి.
2) ఇప్పటి వరకు కంఠస్థం చేసిన ఖుర్‌ఆన్‌లోని సూరాలను పునరావృత్తం చేసుకోవాలి.
3) మధ్యాహ్నం భోజనానంతరం కాసేపు (ఖైలూలా చేయాలి) మేను వాల్చాలి.
4) అస్ర్ నమాజు సమయానికి చేయాలి.
5) అసర్ తర్వాత ఇంట్లోని వారందరూ సామూహిక ఖుర్‌ఆన్ పారాయణం చేయాలి, కొత్త సూరాలను కంఠస్థం చేసుకోవాలి.
6) అర్బయీన్ నవవీ హదీసు పుస్తకం చదవాలి.
7) ఇస్తిగ్ఫార్ మరియు ఉదయం సాయంత్రాలు దుఆలు చదవాలి.
8) సమీపంలో నివసించే బంధువులను సందర్శించడానికి వెళ్ళాలి.
9) ఇషా నమాజు, మరియు రాత్రి భోజనానంతరం ఎదో ఒక ధార్మిక పుస్తకం నాన్న ముందు చదివి దాని వివరణ నాన్న గారితో తెలుసుకోవాలి.
10) వుజూ చేసుకుని పడకపైకెళ్ళి, నిద్రపోక ముందు చదవాల్సిన అజ్కార్ పఠించి **'బిస్మికల్లాహుమ్మ అమూతు వ అహ్యా'** అంటూ నిద్రపోవాలి.

మొట్ట మొదటివి

- సజ్దా తిలావత్ ఉన్న వాక్యంతో అవతరించిన మొదటి సూర – సూరతున్ నజ్మ్.
- పూర్తిగా ఒకేసారి అవతరించిన తొలి సూరా సూర ముద్దస్సిర్.
- మదీనాలో అవతరించిన మొదటి సూరా – సూరతుల్ బఖర
- గుర్రాన్ని మచ్చిక చేసుకొని స్వారి చేసిన మొదటి వ్యక్తి హజ్రత్ ఇస్మాయీల్ (అ).
- స్వర్గంలో ప్రవేశించే మొదటి వ్యక్తి మహా ప్రవక్త ముహమ్మద్ (స). – ఇస్లాంలో మొదటి ఖాజీ హజ్రత్ ఉమర్ ఇబ్నె ఖత్తాబ్ (ర).

చేయవలసిన పనులు

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

1) ఖిలాల్ చేయండి. ఖిలాల్ చేయడం శుచీశుభ్రతలోకి వస్తుంది. శుచీశుభ్రత ఈమాన్‌కి చేరువ చేస్తుంది. విశ్వాసం స్వర్గంలో ప్రవేశింప జేస్తుంది.
2) మూడు విషయాలు ఎంతో అభిలషణీయమైనవి. 1) శుక్రవారం స్నానం చేయడం. 2) మిస్వాక్ (పల్లు తోము పుల్ల) చేయడం. 3) సువాసన పూసుకవడం
3) దైవ దాసుల్లారా! వైద్యం చేయించండి. సృష్టిలో పొడసూపే ప్రతి రోగానికి అల్లాహ్ ఔషధాన్ని పుట్టించి ఉన్నాడు. వృద్ధాప్యానికి తప్ప. దానికి మందు మాకూ – ఏదీ పని చేయదు.
4) పెళ్ళి చేసుకోండి. దాని వల్ల అల్లాహ్ మీ సంపదలో శుభాన్ని, సమృద్ధిని ప్రసాదిస్తాడు.
5) ఉదయాన్నే మేల్కోండి. తద్వారా అనన్య శుభాలు మీ సొంతం అవుతాయి.
6) ఒండొకరిని క్షమిస్తూ ఉండండి. దాని వల్ల కల్లాకపటం దూరమవుతుంది.
7) లేమిలోనూ, కలిమిలోనూ అల్లాహ్‌ను గుర్తు పెట్టుకోండి. అవాంతర సమయంలో అల్లాహ్ మిమ్మల్ని ఆదుకుంటాడు.
8) రాత్రి వేళ భోంచేయండి. కొన్ని ఖర్జూరాలైనా సరే. ఎందుకంటే రాత్రి తినకుండా ఉండటం వల్ల నీరసం కలుగుతుంది.
9) విద్య నేర్చుకోండి. విద్య నేర్చుకోవడంలో వినయ విధేయతల్ని విస్మరించకండి. మీ గురువు పట్ల గౌరవాభిమానంతో మసలుకోండి.
10) నిరాడంబరతను అలవర్చుకోండి. నిరుపేదతో కలిసి కూర్చోండి, దైవం దృష్టిలో గొప్పవారవుతారు. అహం, దురభిమానం నుండి మీకు విముక్తి లభిస్తుంది.

చేయకూడని పనులు


దైవ ప్రవక్త (స) ఇలా హెచ్చరించారు:

1) మీరు రెండు విషయాలకు దూరంగా ఉండండి. అ) మౌఢ్యం. ఆ) బద్ధకం. ఎందుకంటే – మీలో మౌఢ్యం ఉంటే మీరు సత్యాన్ని సహించలేరు. మీరు బద్ధకస్తులైతే హక్కుల్ని నెరవేర్చలేరు.
2) క్షమాపణకి దారి తీసే కార్యానికి దూరంగా ఉండండి.
3) చెడ్డ మిత్రునితో దూరంగా ఉండండి. ఎందుకంటే అతనే మీ పరిచయం (గుర్తింపు)గా మారుతాడు.
4) పిసినారితనానికి మించిన మహమ్మారి మరొకటి లేదు.
5) ముగ్గురు ధర్మం కోసం ముప్పు. 1) నీతి బాహ్యత గల పండితుడు. 2) దౌర్జన్యపరుడైన నాయకుడు. 3) మూర్ఖుడైన సన్యాసి.

ఐపిసి ఆధ్వర్యంలో అరబీ క్లాసు విద్యార్థుల సన్మానం



ఐపిసి ఆధ్వర్యంలో 04-05-2011 వ తేదీ బుధవారం నాడు అరబీ క్లాసు విద్యార్థులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఐపిసి నిర్వహించే అరబీ క్లాసుల్లో పాల్గొని పరీక్షల్లో ఉత్తీర్ణులైన ముస్లిం, ముస్లిమేతర సోదరలకు పట్టాలు ప్రదానం చేయబడ్డాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఐపిసి జెనరల్ మేనేజర్ శ్రీ జమాల్ నాసిర్ షత్తీ గారు మాట్లాడుతూ ఐపిసి సేవల్ని వివరించడంతోపాటు అరబీ భాషా ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. అబ్దుల్ ముహ్సిన్ అల్ ఖరాఫీ గారు అధ్యక్షులుగా వ్యవహరించిన ఈ సభ సుఖాంతంగా ముగిసింది.



ఆసిమా బ్రాంచీ ఆధ్వర్యంలో విహార యాత్ర

ఐపిసి తెలుగు విభాగం ఆధ్వర్యంలో 29- 04- 2011వ తేదీ శుక్రవారం నాడు ఖిబ్లా మంతఖా - సముద్ర తీరంలో విహారం చేశారు తెలుగు న్యూ ముస్లిం విద్యార్థులు. క్రీడా కార్యక్రమంతోపాటు క్విజ్ పోటీలు సయితం నిర్వహించ బడ్డాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చెయ్యడం జరిగంది. ఎంతో ఆనందభరిత వాతావరణంలో సాగిన ఈ కార్య క్రమంలో ఖుర్ఆన్ విశిష్ఠతను తెలియపర్చే కర పత్రాన్ని పంచడం జరిగింది.

నా సత్యాన్వేషణ

(7వ పేజీ తరువాయి భాగం)

ఇస్లాం అంటే శాంతి అని అందరూ అంటూంటే ఏమో అనుకునేవాణ్ణి. కానీ మేము ఇస్లాంలోనికి ప్రవేశించగానే నిజమని అర్థమయింది. నేను నా భార్య ముందు ఎప్పుడూ గొడవ పడే వారం. కానీ ఇప్పుడు మా జీవితంలో ప్రశాంతత, అనురాగం, ప్రేమ, వాత్సల్యం నెలకొంది. నేను కార్లోలో పంపిన ఐపిసి వారి పుస్తకాలు, డీవీడీల వలన నా భార్య కూడా ఇస్లాం గురించి బాగా తెలుసుకున్నది. ఏదైనా భేదాభిప్రాయాలు వచ్చినా ఖుర్‌ఆన్, హదీసు వెలుగులోనే మా సమస్యలు సింపుల్‌గా పరిష్కారమవుతున్నాయి. అల్లాహ్ మరియు ఇస్లాం గొప్పతనం, మహత్యం చూడాలనుకుంటే ఆచరించి అయినా చూడాలి లేక చనిపోయి అయినా తెలుసుకోవాలి. చనిపోయిన తరువాత తెలుసుకుంటే ఫలితం ఉండదు కావున ఈ జీవితంలోనే ఆచరించి ఇహపర లోకాలలోని శాంతిని పొందుదాము రండి.

మనం ఇస్లాం స్వీకరించి పశ్చాత్తాప పడితే మన గత పాపాలను అల్లాహ్ క్షమిస్తాడు. అల్లాహ్‌ను సరియైన రీతిలో వేడుకుంటే ప్రవక్తలకు, ప్రవక్త అనుచరులకు ఎలాగైతే సహాయం చేశాడో ఇన్షాఅల్లాహ్ మనకు కూడా మనం ఊహించని రీతిలో సహాయం చేస్తాడు ఎవరికైనా ఉపయోగపడుతుందని ఉదాహరణగా నా కువైట్ జీవితంలోని ఒక సంఘటన తెలియజేస్తున్నాను.

నేను ముస్లిం కాక ముందు ఒక వ్యక్తి వద్ద 100 దినార్లు అప్పు తీసుకోవలసి వచ్చింది. దానికి వడ్డీ 5 దీనార్లు. ఒకరోజు అతను అర్జంటుగా నాకు డబ్బు అవసరం పడింది. త్వరగా నా డబ్బు ఇవ్వాలి అని చెప్పాడు. మానవ ప్రయత్నంగా నా స్నేహితులకు అడిగాను కానీ ఎవరూ ఇవ్వలేక పోయారు. అవతల అతను రోజూ ఒత్తిడి చేస్తున్నాడు, నాకు ఏ దారి కనబడక మనీదులో నమాజు తర్వాత బాధాతప్త హృదయంతో "నీవు తప్ప వేరే దిక్కు లేదని అల్లాహ్‌తో వేడుకున్నాను" నా దుఆ అయిపోయింది. మనీదులో ఓ మూలన ఒక కువైటీ ఉన్నాడు. అతను నన్ను పిలిచాడు, జేబులో చెయ్యి పెట్టి చాలా దినార్లు తీసి ఎంచుతున్నాడు. నేను మనసులో ఇలా అనుకుంటున్నాను. ఇంత డబ్బు ఉన్న వ్యక్తి కనీసం నాకు 5 దినార్లు అయినా ఇవ్వకపోతాడా అని. కాని అతను కొన్ని దినార్లు నా చేతిలో ఉంచి వెళ్ళి పోయాడు. అవి లెక్క పెట్టి చూస్తే 110 దినార్లు. నా అవసరం కూడా కరెక్ట్‌గా అంతే. నా కళ్ళలో ఆనందభాష్పాలు! వెంటనే సజ్దా చేసి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకొని వెంటనే అప్పు ఇచ్చిన వ్యక్తికి ఫోన్ చేసి పిలిచి అతని డబ్బు 110 దినార్లు ఇచ్చేసి ఋణ విముక్తుణ్ణయ్యాను.

అల్లాహ్ దయ వలన ఐపిసి వారి పుణ్యమా అని ఇస్లాం గురించి మరియు ఆరాధనా పద్ధతులు నేర్చుకున్నాను. ఐపిసి వారి తరపున ఉమ్రాకు వెళ్ళాను, తరువాత హజ్‌కు కూడా వెళ్ళాను. కొద్దికాలంలోనే అల్లాహ్ దయ వలన ఇవన్నీ నెరవేరినవి. ఇందుకు అల్లాహ్‌కు, ఐపిసి వారికి, నా కఫీల్ జమాల్ సఅద్ సఖలాన్ అల్ అజమీ గారికి మరియు మా సార్ సయ్యద్ అబ్బుస్సలాం ఉమ్రీ గారికి, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. అల్లాహ్ వారికి ఇహపరలోకాలలో అనుగ్రహించుగాక!

ఇండియాలో అయితే ఇస్లాం స్వీకరించడం నిలకడగా ఉండటం మరియు ప్రచారం చేయటం ఇబ్బంది ఏమో కానీ అరబ్ కంట్రీ అయినందువలన ఇక్కడ చాలా సౌకర్యాలు ఉన్నాయి. ముఖ్యంగా ఐపిసి వారి కృషి చాలా ఉన్నది. అయితే సన్మార్గము పొందాలనే తపన మనలో కలుగనంత వరకు అల్లాహ్ అనుగ్రహించడు. వారు ముస్లిమ్ అయినా సరే గైర్ ముస్లిం అయినా సరే.

భార్యాపిల్లలను, తల్లిదండ్రులను, స్నేహితులను అందరినీ వదలి కువైట్‌కు వచ్చి డబ్బు పేరు ప్రఖ్యాతులు కూడబెట్టుకొని కొందరు, మరియు వ్యసనాలకు మనోవాంఛలకు బానిసలై దివాళ తీసి అపఖ్యాతి మూటకట్టుకొని కొందరు వెళుతుంటారు. కానీ అల్‌హమ్దులిల్లాహ్ నేను మాత్రం ఇహపరలోకాలలో విజయం సాధించే ఇస్లాం పొందగలిగాను. చివరగా నా సూచన ఏమిటంటే ఇస్లాం స్వీకరించాలని ఉన్నా-బంధువులు, సమాజం ఏమంటారో? మన భవిష్యత్తు ఏమవుతుందో? మన పిల్లల పెళ్ళిళ్ళు అవుతాయో లేదో? అని మధనపడే నా సోదర సోదరీమణులారా! చిన్నచిన్న సమస్యలు కొద్దికాలం మాత్రమే. ప్రాపంచిక జీవితం ఎలా గడవాలన్నది మనం పుట్టుక ముందే అల్లాహ్ లిఖించాడు. కానీ పరలోకం ఎలా ఉంటుంది అనేది అల్లాహ్ ఆజ్ఞలు, ప్రవక్త సాంప్రదాయాన్ని మనం పాటించ దాన్ని బట్టి ఉంటుంది.

సకల శక్తి సంపన్నుడైన అల్లాహ్ అండ మనకు ఉండగా మనం దేనికీ భయపడనవసరం లేదు. ఒక కఫీల్ గానీ, ఒక అధికారి గానీ మరెవరైనా మనకు అప్పజెప్పిన పని పూర్తి చేస్తే దాని ప్రతిఫలం దొరకవచ్చు దొరక్క పోవచ్చు. కువైట్‌లో ఎందరి అనుభవాలు మనం వినలేదూ! కానీ ఎవరి చేతిలో నా జీవన్మరణాలు ఉన్నాయో ఆ అల్లాహ్ సాక్షి! అల్లాహ్ చెప్పిన పని పూర్తి చేస్తే ప్రతిఫలం ఇహపరలోకాలలోనూ తప్పక దొరుకును. పని పూర్తి చేయకపోతే శిక్ష కూడా తప్పక లభిస్తుంది. అసలు పని ఏమిటి? మనల్ని అల్లాహ్ ఎందుకు పుట్టించాడు? అని ఆలోచిస్తే ఖుర్‌ఆన్‌లో దీని సమాధానం దొరుకుతుంది.

"నేను మానవులను జిన్నాతులను నా ఆరాధన కొరకే పుట్టించాను"

(అజ్‌జారియాత్:56)

"ఇక నుండి ప్రపంచంలో మానవులకు మార్గం చూపటానికి, వారి సంస్కరణకూ రంగంలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే. మీరు మంచిని చేయండి అని ఆ జ్ఞాపిస్తారు, చెడు నుండి ఆపుతారు. అల్లాహ్‌ను విశ్వసిస్తారు. ఈ గ్రంథ ప్రజలు విశ్వసించి ఉన్నట్లయితే, వారికే మేలు కలిగి ఉండేది. వారిలో కొందరు విశ్వాసులు కూడా ఉన్నారు, కాని వారిలో అధికులు అవిధేయులు". (ఆలి ఇమ్రాన్ : 110)

ఈ ప్రపంచంలో మన అకామా ఎంతకాలం ఉంటుందో తెలియదు. మహా అయితే 60 లేక 70 సంవత్సరాలు. ఇందులో ఎన్ని సంవత్సరాలు వృధా అయ్యాయో మనం దరికీ తెలుసు. ఇక మిగిలిన కాలం అయినా పశ్చాత్తాప పడి అల్లాహ్‌ను ఆరాధించి ప్రవక్త (స) గారి సాంప్రదాయాలను పాటించి ఇహలోకంలోనూ మరియు పరలోకంలోనూ సుఖశాంతులు పొందుదాము. ఏ లక్ష్యం కోసం అల్లాహ్ మనల్ని పుట్టించాడో అది నెరవేరుద్దాం. ఇస్లాం స్వీకరిద్దాం, పాటిద్దాం. మరియు ఇతరులను కూడా ఆహ్వానిద్దాము. నా ప్రయత్నంగా నా స్వదేశంలోని ప్రజలను కూడా జాగృతం చేయడానికి జూన్‌లో సెలవు మీద ఇండియాకు వెళుతున్నాను. నా ప్రయత్నం ఫలించాలని దుఆ చేయండి. అల్లాహ్ అందరికీ సన్మార్గము ప్రసాదించుగాక ! (ఆమీన్)

– శాంతి ప్రియ

కోటికొక్కడు దొరకడు కోరి వెతికినా

ధర్మాన్ని ధరత్రిపై యాథాస్థితిలో నెలకొల్పి
విజ్ఞుల కామృత దివ్యావిష్కృతుల విందులిచ్చి
న్యాయంగా సుమనస్కుల పక్షం వహించి
వంశ డాంబికాల దుష్కృత పరంపరలను త్రెంచిన
ఇలలో అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) వంటి
శాంతి కాముకి, కరుణ పిపాసి, సాధు స్వభావి
కోటికొక్కడు దొరకడు కోరి వెతికినా

ఆయన –
తండ్రి చేతి గోరు ముద్దలు ఎరుగరు సరికదా జననా
నంతరం అనతి కాలంలోనే తల్లి ప్రేమకు దూరమయి
ముక్కుపచ్చలారని వయసులోనే తాత ముత్తలిబ్‌ను కోల్పోయి
అబూ తాలిబ్ వాత్సల్య నీడలో పెరిగారు ముహమ్మద్ (స)

బీదసాదల పాలిట పెన్నిధని ఖ్యాతి
గాంచిన ప్రణుత గుణము గల ప్రవరులు
ప్రజల మేలునాశపడు ప్రవక్తోత్తములు
వ్యర్థ వేషాలకు దూరంగా మసలిన మహితాత్ములు
వృద్ధ జీవులు, వితంత స్త్రీలు, అనాథ ప్రజలు
కోరగా రుణాలిచ్చి ఆదుకొను ఆపద్బాంధవులు
పరుల బాధను తన బాధగా ఎంచు పరి
తపించు పరమ శ్రేయోభిలాషి ముహమ్మద్ (స)

అతిథులను సత్కరించు సుభక్తాగ్రేసరులు
నిఖిల దుర్గుణాలను నిర్మూలించినారు
సమస్త సద్గుణాలకు శ్రీకారం చుట్టినారు
విద్యతో విజ్ఞతో విశ్వకర్తను గుర్తించమన్నారు
న్యాయాధిపతి నీతి బాటన నడవమన్నారు
సర్వ ప్రాణుల ఎడల సాత్విక కరుణ
గలవారే శాంతిప్రియ యశస్వులన్నారు
సద్గుణమనే శిఖరంపై కూర్చునవారే
విశ్వాస గణంలో భక్తోత్తములన్నారు

దాసులకు మేలైన ధనం ధర్మమన్నారు
ధర్మంకంటే ఘన లాభపాటి ఈ జగాన లేదన్నారు
మనసున కల్మషం ఉంచుకోవద్దన్నారు
పైపై మెరుగులు అసలొద్దన్నారు
పాప పంకిల పరిసరాలకెళ్ళొద్దన్నారు
పుణ్యాలు చేసేవారి మనుగడకే ఆపద లేదన్నారు
అహం రహిత ఆచరణే సర్వోన్నతం అన్నారు
శీలం స్త్రీపురుషుల సిసలైన సంపదన్నారు
శీల రహిత సమాజం శాపమన్నారు

నర రుధిర దాహమధికమై మారణహోమం సాగుతుంటే
సర్వసంగ పరిత్యాగులమంటూ సొమ్ము వమ్ము చేస్తుంటే
కోరిన వరాలిస్తామంటూ కొంపలు కూల్చుతుంటే
కోపంతో రగిలిపోయిన కారుణ్యమూర్తి ముహమ్మద్ (స)
నక్షత్ర విద్య మిథ్య అంటూ, తాయెత్తు తమస్సుకి
తార్కాణమంటూ, క్షుద్ర విన్యాసాలు క్షమార్హం కాదంటూ
సమర శంఖం పూరించి సత్య కేతనం ఎగురవేసిన
ప్రవక్తలందరి నాయకమన్యులు ముహమ్మద్ (స) వంటి
సత్యప్రియుడు, ధీర శాంతుడు, ధర్మపరాయణుడు
కోటికొక్కడు దొరకడు కోరి వెతికినా

అందుకే ఆయనకు ఖుర్‌ఆన్ పుష్పాంజలి ఘటిస్తోంది:
"ఇన్నల్లాహ వ మలాయికతహు యుసల్లూన అలన్నబియ్యి యా అయ్యుహల్లజీన ఆమనూ సల్లూ అలైహి వ సల్లిమూ తస్లీమా".
(సల్లల్లాహు అలైహి వ ఆలిహి వ సల్లం)

పసివాడి ప్రార్థన

అనుక్షణం కాబా నా కళ్ళెదుటుండాలి
అనునిత్యం దైవ నామం నా మదిన మెదులుతుండాలి
ప్రతి నిమిషం నా వీనులు ఖుర్‌ఆన్ వింటుండాలి
ప్రతి ఘడియ నా అధరాలు సల్లి అలా అంటుండాలి

గోరు ముద్దలూ వద్దు, జోల పాటలూ నాకొద్దు
మణులూ వద్దు, మాణిక్యాలూ నాకొద్దు
నీ అతీఖ్ గృహ దర్శనమే నాకు ముద్దు
అదే అదే నా కోరికల సరిహద్దు



అమ్మకు మించిన వరం లేదని
ఆమె పాదాల చెంత స్వర్గం ఉందని
పలికిన ప్రియ ప్రవక్త జన్మస్థలం మక్కా
విశ్వ జనులందరి పాలిట మార్గ
దర్శక కేంద్రం మక్కా

కనులు ప్రసాదించిన ఓ కరుణా నిధీ!
కాబా దర్శన భాగ్యం కలిగించు
వీనులు అనుగ్రహించిన ఓ విశ్వ పాలకా!
మక్కా అజాన్ వినే అదృష్టం కల్పించు
చేతులు ప్రసాదించిన ఓ దయాకరా!
కాబా పరదాను స్పృశించే భాగ్యాననుగ్రహించు
(ఆమీన్!)

– హఫీజుల్లాహ్

- అబుల్ తాసన్

నేటి బాలలే రేపటి పౌరులు - 14



ఒక రోజు గాలులు వీయడం ప్రారంభ మయింది. ఒకడు – జోరుగా శ్వాస పీల్చి, ఇవి ఖచ్చితంగా వాన గాలులే..... మరొకడు – అవును భూమి కూడా చెమ్మగిల్లుతూ ఉంది... మూడో వ్యక్తి – అదుగో...! నల్లటి మేఘాలు... వర్షం తప్పకుండా కురుస్తుంది.... నాలుగో వ్యక్తి – ఊరి ప్రజాలారా! పదండి, ఆ కారు మేఘాల నీడలో ఓలలాడుదాం... కురిసే మొదటి వాన చినుకు మనపైనే పడాలి...పదండి....తొందర చేయండి..!!

అందరూ ఆ కారు మేఘాల నీడలోకి చేరుకున్నారు. ముసలి –ముతకా, పిల్లా–జల్లా ఎవ్వరూ ఊరిలో లేరు. అందరూ ఎంతో ఆత్రంతో, వాన కురుస్తుందన్న గంపెడు ఆశతో ఆ మేఘాల వైపే తీక్షణంగా చూస్తున్నారు. అకస్మాత్తుగా అక్కడ ఓ విచిత్ర సంఘటన చోటు చేసు కుంది. ఆ కారు మేఘాలు వారిపై పెద్ద పెద్ద నిప్పురవ్వలను కురిపించాయి. వాటి దెబ్బకు భూమి దద్దరిల్లింది. తర్వాత అతి తీవ్రమైన మెరుపు కూడా వారిపై విరుచు కుపడింది. ఎక్కడున్నవారు అక్కడే కదల కుండా కాలి భస్మమైపోయారు.

దుర్మార్గుల ఆ ఊరి నుండి బయలు దేరిన హజ్రత్ షుఐబ్ (అ) గారు, మరియు ఆయన సహచరులు మక్కా చేరుకుని అక్కడేఉండి పోయారు. హజ్రత్ షుఐబ్ (అ) మక్కాలోనే పరమ పదించారు. అక్కడే ఆయన సమాధి చేయబడ్డారు. (పిల్లలందరూ రెప్ప వాల్చ కుండా వింటున్నారు..) కనుక తూనికల్లో తగ్గించి ఇవ్వడం, మోసం చేయడం మహా చెడ్డ కార్యాలు. ఎవరి నుంచి తప్పించుకున్న అల్లాహ్ పట్టు నుండి ఏ ఒక్కరూ తప్పించుకు పారిపోలేరు అర్థమ య్యిందా...! అని కథ పూర్తి చేశాడు అలీ.

అలీ పిల్లలందరినీ ఒక వరుసలో కూర్చోబెట్టాడు. ఇప్పుడు వాళ్ళు అతనికి బాగా దగ్గరయ్యారు. ప్రతి ఒకరూ తమ తమ పాఠాలు అప్పగించారు. ఒకరిద్దరు నిన్న ఇచ్చిన దుఆలు కూడా కంఠస్థం చేసుకొని వచ్చారు. అయితే ఖాలిద్, జుబైర్, యాసిర్‌లు కాస్త వెనకబడి ఉన్నారు. పాఠం చెప్పేటప్పుడు కళ్ళు ములుపుతూ కొంటె చేష్టలు చేస్తున్నారు. వారికి ఇంకా చికిత్స చేయవలసి ఉంది.

ఆ రోజు అలీ కెంతో ముచ్చటగా ఉంది. అతని మనస్సు ఆనదంతో ఉప్పొంగు తుంది. రండీ, ఈ రోజు మనం ఒక పాట పాడుకుందాం!! పాట తను పాడుతూ పాడించాడు. **'పర్‌వర్ దిగారె ఆలమ్, తేరాహి హై సహారా. తేరే సివా జహాఁమే కోయి నహీఁ హమారా..'** పాట ఎంతో సరళంగా ఉంది.

అది ప్రార్థనా గీతం. ఇవాళ అప్రయత్నం గానే అలీ నోటి నుండి ప్రార్థనా గీతం ధ్వనించింది. ఆ తర్వాత అందరూ ఇళ్ళకు చేరుకున్నారు.

దారమ్మిడి సాగిపోతూ అలీ ఆలోచిస్తు న్నాడు. కథలు వినిపించడం ద్వారా చరిత్ర బోధనకు పునాది వేస్తున్నాను. ఈ రోజులాగే మరిన్ని గేయాల ద్వారా హమ్ద్, నఅత్, నజమ్ లాంటివి వారికి నేర్పాలి. ఖుర్‌ఆన్ ఆదర్శ పాఠం ఎంతో చక్కగా సాగుతూ ఉంది. అయితే క్విజ్ కార్య క్రమం కూడా ప్రారంభిస్తే బాగుంటుంది. అలా విన్న గాధలను గుర్తు చేసుకోవ డానికి దోహదపడుతుంది. బాల విహార్ లో ఉన్న వ్యవధిలో ఇవన్నీ చేస్తూ ఇది

ఆ రోజు అలీ కెంతో ముచ్చటగా ఉంది. అతని మనస్సు ఆనదంతో ఉప్పొంగు తుంది. రండీ, ఈ రోజు మనం ఒకసాధ్యపడదు. కనుక విహార యాత్రయే దీనికి సరైన పరిష్కారం...' అని అనుకుంటూ ఇంటికి చేరాడు అలీ.

రోజులు బిరబిరా గడిచిపోతున్నాయి. ప్రస్తుతం బాల విహార్‌లో ఈ రకమైన కార్యక్రమం కొనసాగుతూ ఉంది. వార్తా కథనం, ఖుర్‌ఆన్ పఠనం, ఆటలు, కవితా శ్రవణం, పరిశుభ్రత, ప్రార్థనా గీతం.

నెలవంక ఉత్తరాలు

సత్యాక్షరాల సత్కారం

గౌరవనీయులైన మాజీ నెలవంక ఎడిటర్ శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారికి...

కువైట్‌లో **నెలవంక** సంపాదకత్వ బాధ్యతలను విరమించుకుని స్వదేశానికి తిరిగి వెళ్ళినా... మీ మనస్సు మాత్రం **నెలవంక** పత్రిక చుట్టు...నెలవంక పాఠకుల చుట్టూ నిరంతరం పరిభ్రమిస్తూనే ఉందని నాకు తెలుసు. **నెలవంక**లో మీ దృక్పథంతో స్వాగతం పలికి, మీ వ్యాసాలు, విశ్లేషణలు, హితోపదేశాల ఆతిథ్యమిచ్చి, ఎందరినో ప్రభావితం చేసి, వారి జీవితాలను సవ్య దిశలో పయనించేలా చేసి, సన్మార్గం ఇదని చూపి, మీ ఆత్మీయ హృదయంతో సత్య నిష్ఠ, ధర్మనిరతి, దైవ భక్తి, దయ, పరోపకారం, త్యాగం, ఔదార్యం, సకల సద్గుణాల సమాహారాన్ని సుమనోహరంగా పాఠక లోకానికి అందించి, భవిష్యత్తులోని బాధ్యతల దశ దిశలను ఎరుక పర్చి, కువైట్‌లోని తెలుగు ప్రజలకు ఏనలేని సేవ లందించి, ఎంతో మంది హృదయాలలో చిరస్మరణీయ ఆప్తునిగా, హితునిగా, స్నేహితునిగా, శ్రేయోభిలాషిగా ఆదర్శ భావాల సృజనకు స్ఫూర్తిగా, మహా శిల్పిగా స్వయంకృషిలో ఒక ఋషిగా, ఖుర్‌ఆన్ అనువాదకునిగా, **నెలవంక** సారధిగా సదా నిలిచి ఉంటారు. **నెలవంక** పత్రికను ప్రత్యేక తరహాలో శోభాయమానంగా తీర్చి, కూర్చిన చిత్రకారులు మీరు. మీ బాధ్యతను సజావుగా, సంపూర్ణంగా నెరవేర్చిన మీకు నా హృదయ పూర్వక అభినందనలతోపాటు ఇదే నా సత్యాక్షరాల సత్కారం... సుధా కుసుమాల సుమహారం. - ఇట్లు

సుధాకర్ (కువైట్)

'జర భద్రం!'

నా పేరు వై వెంకటేష్. నేను ఇస్లాం స్వీకరించి 10 సంవత్సరాలయింది. ప్రస్తుతం నా పేరు సిరాజ్. ఉమైరియాలో డ్రైవర్‌గా పని చేసే నేను నెలనెలా వెన్నెల్ని పంచే **నెలవంక**ను ముస్లింలు, ముస్లిమేతరులందరికి పంచుతుంటాను. **నెలవంక** చదివినప్పుడు **నెలవంక**లో ఉన్న విషయాలు సమాజానికి సంబంధించిన విషయాలు అన్న యదార్థాన్ని ప్రతి ఒక్కరు ఇట్టే పసిగట్టగలరు. ముఖ్యంగా ఏప్రిల్ **నెలవంక** 200 కాపీలను పంచితే 'జర భద్రం!' అన్న ఆర్టికల్ చదివిన తర్వాత అందులో 50 మంది ఈ ఆర్టికల్ వల్ల మాకు కనువిప్పు కలిగిందన్నారు. ఇలాంటి ఆర్టికల్స్ మరిన్ని రావాలని కోరారు. వారందరూ నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలిపారు. అలాగే **నెలవంక**లో ఇస్లాం శిక్షణ పేరుతో ఒక పేజీ ఆర్టికల్ ప్రతి నెలా వస్తుంది. ఈ పేజీని చూసి చాలా మంది సమాజంటే ఏమిటో, వుజూ దేన్నం టారో తెలుసుకోగలుగుతున్నారు. ఇంతటి గొప్ప సంచిక అంద జేస్తున్న ఐపిసి యాజమాన్యానికి, **నెలవంక** ఎడిటర్ గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

- ఇట్లు

సిరాజ్ (ఉమైరియా)

అంమైన ఓ పూర్ణ సోమా!

నెలవంకలాగే తాను ప్రకాశించింది
ప్రకాశించగానే పరిమళాల్ని పంచింది
పాఠక హృదయాల సదనాలలో చేరి
కాంతి కిరణంగా వెలిగింది

తౌహీద్ పాఠాల్ని బోధించింది
షిర్క్ దుష్ఫలితాలను చూపింది
చదువరుల్ని మెప్పించి ఒప్పించి
సత్య మార్గంలోకి రప్పించింది

పువ్వులా అది విరబూసింది
అందరి మనసులు దోచింది
శ్రోతలను అలరించింది
అమూల్య విషయాలనందించింది

నెలవంక ముత్యంలాగే మెరిసింది
నెలవంక సత్యంలాగే నిలిచింది
ఐదేళ్ళు నిండిన **నెలవంక** షడ్రుచుల
అష్ట అదృష్టాల సమాహారంగా
స్వాతి ముత్యాల హారంగా
నిత్యం ఇలానే ఉంటుంది

అందమైన ఓ పూర్ణ సోమా!
ఎంత నిండైనది నీ జాబిల్లీ
ఇంకో ఉత్తరంతో కలుద్దాం మళ్లీ!!

- ఉదయ భాను

వేసవి చిట్కాలు

వేసవి మళ్ళీ వచ్చింది....వేడిని, వడగాల్పులను, ఎడారి దుమ్మును వెంటేసుకుని. దాహం, అలసట, నీరసం షరా మామూలే. అయితే సీజన్‌లో వచ్చే పళ్ళన్నింటినీ తినడం వల్ల చెమట వల్ల తగ్గే పోషక పదార్థాలను వీటి ద్వారా మనం పొందవచ్చు.



నిమ్మకాయ: పేరు వింటే చాలు నోరూరుతుంది. నిమ్మ రసం రోజుకి రెండు సార్లు తీసుకోవడం ఎంతో మంచిది.



మామిడి పండు: దీన్ని ఉర్దూలో 'ఫలోఁకా బాదుష' అనంటారు. అంటే పండ్లకే రారాజు అన్న మాట. మామిడి పండును ఇష్టపడని వారంటూ ఎవరూ ఉండరు. ఇందులో సయితం అనేకానేక లాభాలున్నాయి. దీని రకాలు 3000కు పై చిలుకే.



లంక దోసకాయ: కర్బూజా మాదిరిగానే మంచి పరిమళం గలదై ఎంతో మధురంగా ఉంటుంది. దీనిలో కెరోటిన్, సి విటమిన్‌తో పాటు ఇతర ఖనిజాలు కూడా మెండుగానే ఉంటాయి.



పుచ్చ కాయ: వెసవిలో పుచ్చకాయను చూస్తే సగం దాహం తీరిపోతుంది. అందుకే పుచ్చ ప్రియులకు ఇదంటే అంత పిచ్చి. ఇందులో శరీరా రోగ్యానికి దోహదపడే అనేక పోషక పదార్థాలు న్నాయి. దీని రకాలు సుమారు 1200.

పోషకాలు

వందగ్రాముల గుజ్జులో...

శక్తి	: 30 కిలో క్యాలరీలు
పిండిపదార్థాలు	: 7.5గ్రా.
పీచు	: 0.4గ్రా.
ప్రొటీన్	: 0.6గ్రా.
నీరు	: 91.5%
విటమిన్-ఎ	: 3 %
విటమిన్-సి	: 8.1మి.గ్రా.
కాల్షియం	: 7మి.గ్రా.
ఐరన్	: 0.24మి.గ్రా.
మెగ్నీషియం	: 10 మి.గ్రా.
ఫాస్ఫరస్	: 11మి.గ్రా.
పొటాషియం	: 112మి.గ్రా.
జింక్	: 0.1మి.గ్రా.



వేసవిలో అన్నీ రకాల కూరగాయలు, తాజా ఫలాలు తీసుకోవడం ఎంతో మంచిది. అలాగే అప్పుడప్పుడు గుడ్లు, చికెన్, మటన్ లాంటివి కూడా తీసుకుంటూ ఉండాలి సుమా!

కొబ్బరి బొండాం: వేసవిలో దేవుడు మనకిచ్చిన ప్రకృతి సిద్ధమైన చల్లని పానీయం ఏదంటే కొబ్బరి బొండాం అని చెప్పక తప్పదు. బజారులో దొరికే కృత్రిమ కూల్‌డ్రింక్స్‌కన్నా ఎన్నో రెట్లు మేలైనది కొబ్బరి బొండాం.





సీమ చింతకాయ: నిన్నటి తరానికి బాల్య జ్ఞాపకంగానూ, నేటి తరానికి నూతన పండుగానూ ప్రస్తుతం మార్కెట్‌లో అందరిని అలరిస్తోంది. దీన్ని హిందిలో జంగిల్ జిలేబి అనంటారు. దీనిలో కూడా ఎన్నో పోషకపదార్థాలున్నాయి.



జీడి మామిడి పండు: దీనిలో విటమిన్ 'సి'తో పాటు ఇతర ఖనిజ లవణాలు ఎక్కువ. దీన్ని తినడం వల్ల లాభమేగాని నష్టం లేదు.



లవ్ యాపిల్, రోజ్ యాపిల్, వాక్స్ యాపిల్, యాపిల్ జామ, రాయల్ యాపిల్, యాపిల్ వాటర్...ఇలా రకరకాల పేర్లతో పిలిచే ఈ పండును తెలుగులో జంబు నేరేడు అంటాము. దీనిలో ఓలియో నోలిక్ ఆమ్లానికి 'హెచ్‌ఐవి'ని ఎదుర్కొనే శక్తి ఎక్కువ. ఇది తినడం వల్ల చర్మం తాజా మెరుపుని పొందుతుంది. ఇంకా ఇందులో కాల్షియం, ఫాస్ఫరన్, రిబోఫ్లేవిన్, నియాసిన్, కెరోటిన్, ఐరన్ వంటి మూలికాలు ఎక్కువ శాతంలోనే ఉంటాయి. దీన్ని తినడం వల్ల డిప్రెషన్, ఒత్తిడి తగ్గుతుందన్నది ప్రతీతి.

మేరాజ్ సందేశం



- నిజ దైవమైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి. ఇతరులెవ్వరిని ఆయనకు సహవర్తులుగా చేరచకూడదు.
- తల్లిదండ్రుల యెడల ఉత్తమంగా వ్యవహరించాలి. ముఖ్యంగా ముదిమి దశలో వారితో ఎంతో సౌమ్యంగా మసలుకోవాలి. అణకువ, దయాభావం ఉట్టిపడేలా వారి పట్ల విధేయతను కనబర్చాలి. బాల్యంలో వారు మనల్ని ఎంత ప్రేమ వాత్సల్యంతో చూసుకున్నారో అంతే ప్రేమగా వారిని మనం వృద్ధాప్యంలో చూసుకోవాలి.
- సామాజిక జీవితంలో అందరి యెడల మంచిగా మెలగాలి. పరుల హక్కులను గుర్తించాలి. ఒకరు మనకివ్వకపోయినా మనం మాత్రం హక్కుదారులకు, అనాథలకు, వితంతువులకు, బంధుమిత్రులకు, నిరుపేదలకు, అవసరార్థులకు, బాటసారులకు ఇవ్వాలి.
- అన్ని వ్యవహారాల్లోనూ దుబారా ఖర్చుకు దూరంగా ఉండాలి. బడాయి కోసం డబ్బును తగలెట్టడం ముమ్మాటికి షైతాను చర్యే, అటువంటి జల్సారాయుళ్ళు షైతాన్ సోదరులవుతారు.
- ఖర్చు విషయంలో అనునిత్యం సమతూకాన్ని పాటించాలి. ఇటు మరీ పిసినారులుగా ఉండకూడదు. అటు మరీ విచ్చలవిడిగా ఖర్చు చేయకూడదు. అలా చేస్తే - నిందల పాలవ్వాల్సి వస్తోంది. దిక్కుమాలిన స్థితికి లోనయ్యే ప్రమాదముంది.
- ఉపాధిని ప్రసాదించే విషయంలో ఎవరికెక్కువ ఇవ్వాలి, ఎవరికి తక్కువ ఇవ్వాలన్నది దైవాభీష్టం మేరకే జరుగుతుంది. కనుక మానవుడు తన కృత్రిమ ఉపాయాలతో తనను అపాయాలకు గురి చేసుకో కూడదు.

- దారిద్ర్య భయంతో మనం మన సంతానాన్ని చంపకూడదు. మన పూర్వీకులకు, మనకు, మన పిల్లలకు, వారి పిల్లలకు, వారి తర్వాత ప్రళయం వరకూ రాబోయే భావి తరాలకు - అందరికీ ఉపాధినిచ్చే వాడు అల్లాహ్ మాత్రమేనన్న విషయాన్ని విస్మరించకూడదు.
- వ్యభిచారం - దానికి దోహదపడే నికృష్ట చేష్టలన్నింటికీ దూరంగా ఉండాలి. నిజంగా అక్రమ సంబంధం అనేది మహా చెడ్డ కార్యం.
- ప్రాణం ఏ ప్రాణిదైనా ఎంతో పవిత్రమైనది. కనుక ఏ వ్యక్తికీ తన్ను చంపుకునే హక్కుగానీ, అన్యాయంగా ఇతర ప్రాణులను బలిగొనే అధికారం గాని లేదు. అలాగే ప్రతీకారం తీర్చుకోవడంలోనూ న్యాయబద్ధంగా వ్యవహరించాలి. క్షమించేయడం మరింత ఉత్తమం.
- అనాథల ఆస్తులను రక్షించాలి. చెడు ఉద్దేశ్యంతో వారి ఆస్తిని సమీపించకూడదు. మన ప్రతి చర్యకు ప్రతి చర్య తప్పనిసరిగా ఉంటుందని, అల్లాహ్ మనల్ని ప్రశ్నిస్తాడని మనం మరచిపోకూడదు.
- ఒప్పందాలు - అవి జాతుల మధ్య జరిగినా, వ్యక్తుల మధ్య జరిగినా వాటికి కట్టుబడి ఉండాలి. ఆడిన మాట తప్పకూడదు.
- వ్యాపార లావాదేవీలలో, కొలతల్లో, తూనికల్లో న్యాయంగా వ్యవహరించాలి. మోసానికి ఒడిగట్టకూడదు.
- మనకు తెలియని విషయాల వెంట పడకూడదు. చెవులు, కళ్ళు, హృదయం - వీటన్నింటి గురించి ప్రశ్నించబడుతుందని గుర్తుంచుకోవాలి.
- మనం ఎంత నిస్సహాయులమో ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. మన ప్రతాపం చూపించే నిమిత్తం నిక్కుతూ మనం నడిచినా దాని వల్ల మనం భూమిని చీల్చనూ లేము. పర్వతాల ఎత్తుకు ఎదగనూ లేము.